ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 21 డిసెంబరు 2024

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలి

● విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రణాళికా బద్ధంగా ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లాలో ఇళ్ల నిర్మాణ ప్రగతి, వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, వ్యక్తిగత మరుగుదొడ్ల జియో ట్యాగింగ్ అంశాల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డీఈ, ఏఈ, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డీఆర్‌డీఏ ఏపీఎం, డ్వామా ఏపీవో, పంచాయతీ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఒక గూడు కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, ఇప్పటికే ఇళ్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి బుధవారం హౌసింగ్ ఏఈ మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏపీవో, ఏపీఎం, పంచాయతీ సెక్రటరీలతో స్టేజీ వారి గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీడీవో సమావేశం నిర్వహించి గృహ నిర్మాణంలో ప్రగతి సాధించాలన్నారు. వచ్చే వారం మరలా సమీక్షిస్తామని, అప్పటికే స్టేజీ వారి ప్రగతి సాధించని వారిపై తప్పనిసరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్, డీఆర్‌డీఏ పీడీలు శివయ్య, సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ డీఈ, ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపీఎం, ఏపీవో, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

పరిటాల రవి హత్య కేసులో..
బెయిలుపై నలుగురు విడుదల

కడప క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత పరిటాల రవి 2005 జనవరి 25న అనంతపురంలో హత్యకు గురయ్యారు. ఈ కేసులో 12 మందికి శిక్ష పడింది. నలుగురు కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. వీరికి హైకోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. దీంతో నలుగురు బెయిలుపై శుక్రవారం కడప కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యారు. వీరి విడుదల సందర్భంగా కుటుంబ సభ్యులు కడప కేంద్ర కారాగారానికి చేరుకున్నారు. విడుదలైన వారిని వాహనాల్లో ఎక్కించుకుని సొంతూర్లకు వెళ్లారు.

పరిటాల రవి హత్య కేసులో 12 మందిపై కేసు నమోదు కాగా వీరిలో ఇప్పటికే మద్దెల చెరువు సూరి, మొద్దు శీను, కొండారెడ్డి, పటోళ్ల గోవర్ధనరెడ్డి చనిపోయారు. ఆరు నెలల క్రితం వన్న హనుమంతురెడ్డి, వడ్డె శీను, పెద్దిరెడ్డి బెయిలుపై బయటకు వచ్చారు. ప్రస్తుతం కడప సెంట్రల్ జైలు నుంచి నారాయణరెడ్డి, ఓబిరెడ్డి, రంగనాయకులు, వడ్డె కొండ విడుదలయ్యారు. అలాగే వైజాగ్ సెంట్రల్ జైలులో ఉన్న రేఖమయ్య కూడా విడుదల అయ్యారు. వీరంతా ప్రతి సోమవారం పోలీసుస్టేషనులో హాజరు కావాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా బెయిలుపై వచ్చిన వారిని మీడియా పలకరించే ప్రయత్నం చేయగా నారాయణరెడ్డి స్పందిస్తూ హైకోర్టు ఉత్తర్వులమేరకు ఈ విషయాలపై స్పందించబోమంటూ కారు ఎక్కి వెళ్లిపోయారు. అయితే 18 ఏళ్ల తరువాత బెయిలుపై విడుదలయ్యారంటూ వారి బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పగవాడికి కూడా ఇలాంటి కష్టాలు ఉండకూడదంటూ వారి బంధువులు ఆవేదనతో చెప్పుకొచ్చారు.



కడప సెంట్రల్ జైలు నుంచి బెయిలుపై బయటకు వస్తున్న పరిటాల రవి హత్య కేసు నిందితులు

మేకల మందపై చిరుత దాడి

● ఒక మేక మృతి
● కనిపించని ఐదు జీవాల జాడ
● కుక్కల సాయంతో ప్రాణాలతో బయటపడ్డ కాపరి

6



ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

● ప్రారంభమైన పెద్దేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు 6

6 చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు

హెల్మెట్ బరువు కాదు..
ప్రాణాలకు రక్ష



● పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
● హెల్మెట్ వాడకపోవడంతోనే ప్రాణాలు గాలిలోకి
● హైకోర్టు ఆదేశాలతో.. పోలీసులు కొరడా ఝులిపించేనా ?

ఈ చిత్రంలో ఫొటో పట్టుకుని కన్నీటి పర్యంతమవుతున్న వ్యక్తి పేరు వెంకటరెడ్డి.. ఫొటోలో ఉన్నది.. అతని కొడుకు యశ్వంత్‌రెడ్డి (19) ఈ ఏడాది అక్టోబరు 18న కళాశాలకు వెళ్లి మదనపల్లె నుంచి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా.. కురబలకోట మండలం దాదంవారిపల్లె వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో.. యశ్వంత్‌రెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. మదనపల్లెలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న మృతుడు తంబళ్లపల్లె మండలం, చెట్లవారిపల్లెకు చెందిన వాడు. వీరి తల్లిదండ్రులకు ఇతను ఒకడే సంతానం.



కుమారుడి ఫొటోతో వెంకటరెడ్డి

ఇదే ప్రమాదంలో ఇదే మండలం మలిగివారిపల్లెకు చెందిన అజయ్‌కుమార్‌రెడ్డి (19) కూడా చనిపోయారు. ఇతను కూడా తల్లిదండ్రులకు ఒకడే మగసంతానం. మృతులిద్దరూ స్నేహితులు. ఇద్దరూ ద్విచక్రవాహనంలో ప్రయాణించే సమయంలో హెల్మెట్లు ధరించలేదు. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో.. అక్కడికక్కడే చనిపోయారు. ప్రస్తుతం వీరి తల్లిదండ్రులు చెట్టంత బిడ్డలు చనిపోవడంతో.. బతకలేక.. చావలేక.. క్షణక్షణం కుళ్లికుళ్లి ఏడుస్తున్నారు. ఆ చావేదో... మాకు వచ్చింటే బాగుండు కదా అని.. ఆ దేవుడిని తిట్టిపోస్తున్నారు. బిడ్డలు చనిపోయి రెండు నెలలు గడుస్తున్నా.. ఆ బాధ నుంచి కోలుకోలేక... ప్రాణమున్న శవాల్లా.. బతుకీడుస్తున్నారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో కుటుంబానికి ఆధారమైన వ్యక్తులో.. చేతికి అందివచ్చిన బిడ్డలు చనిపోతే.. ఆ కుటుంబాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో చెప్పడానికి నిలువెత్తు నిదర్శనాలే.. పై సంఘటనలు.. అయితే ఎక్కువగా ద్విచక్రవాహన రోడ్డు ప్రమాదాల్లో.. తలకు హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే.. మరణాలు సంభవిస్తున్నాయి. హెల్మెట్ పెట్టుకోవడం తలకు భారమనో.? లేకపోతే వెంట్రుకలు చెదిరిపోయి... తమ అందం దెబ్బ తింటుందనే? కారణంతో సాధారణంగా ఎక్కువ మంది హెల్మెట్ పెట్టుకోవడం లేదు. దీంతో చిన్న చిన్న ప్రమాదాలకే తలకుగాయమై.. ప్రాణాలు కోల్పోతున్నారు. శరీరం మీద చిన్న గాటు కూడా లేకున్నా.. సరాసరి తల నేలకు తగలడమో ? దెబ్బ తలకే తగలడం వల్ల పలువురు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకపోవడంపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ద్విచక్రవాహనం నడిపే వ్యక్తే కాకుండా.. వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొంది. అలా చేయకుంటే.. కఠినంగా జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో.. గత ఆరు నెలల కాలంలో జిల్లాలో జరిగిన ద్విచక్రవాహనాల రోడ్డు ప్రమాదాలు.. అందులో చనిపోయిన వ్యక్తులను గమనిస్తే..

● రైల్వేకోడూరు పోలీసుస్టేషన్ పరిధిలో గత ఆరు నెలలుగా 15 మోటారు వాహనాల ప్రమాదాలు జరిగాయి. అందులో 9 మంది మృతి చెందగా.. 11 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. మృతుల్లో ఐదు మంది యువకులు ఉన్నారు.

● చిట్వేలి మండలంలో.. గత ఆరు నెలలుగా ఆరు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అందులో ముగ్గురు చనిపోగా.. పదిమందికి గాయాలయ్యాయి.

● వాల్మీకిపురంలో.. ఆగస్టు 11న మదనపల్లెకు చెందిన నల్లప్ప(65) తన అల్లుడితో పాటు.. ద్విచక్రవాహనంలో వస్తుండగా.. మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో.. మృతి చెందాడు.

● రామసముద్రం మండలంలో.. గత సెప్టెంబరు 10న మండలంలోని చంబకూరుకు చెందిన నూర్జహాన్ తన కుమారుడితో కలిసి.. వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం పుంగనూరు సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై పడడంతో.. వెనుక కూర్చున్న నూర్జహాన్ అక్కడికక్కడే మృతి చెందింది.

● రామాపురం మండలంలో.. గత ఆరు నెలల్లో 8 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోయారు.

● సుండుపల్లె మండలంలో.. ఐదు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఐదు మంది గాయపడ్డారు.

● సంబేపల్లె మండలంలో.. గత ఆరు నెలల్లో ఎనిమిది ద్విచక్రవాహన ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో.. ఏడు మంది చనిపోయారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

● పెద్దతిప్పసముద్రం మండలం.. కర్నాటక సరిహద్దు చెన్నారాయణపల్లె క్రాసు వద్ద నవంబరు 18న ట్రాక్టరును ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో రామాంజి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆరు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇద్దరు చనిపోయారు.



తలకు గాయమై మృతి చెందిన రామాంజి

● బి.కొత్తకోట పట్టణ శివార్లలో.. ఆలేటిపల్లె క్రాస్ వద్ద టీవీఎస్‌ను ఆటో ఢీకొనడంతో.. పీటీఎం మండలం బుర్లపల్లెకు చెందిన పాతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి (23) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నెల్లూరులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు.

● రాజంపేట పట్టణంలో.. గత ఆరు నెలల వ్యవధిలో 8 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. డిసెంబరు 14న బోయనపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నమాచార్య యూనివర్శిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కిరణ్, అతని స్నేహితుడు బన్నీనాధరెడ్డి మృతి చెందారు. కిరణ్ పుట్టిన రోజు వేడుకల కోసం బన్నీనాధరెడ్డి వచ్చారు.



● కలకడ సత్యవతి బ్రిడ్జి సమీపంలో సెప్టెంబరు 11న ద్విచక్రవాహనాన్ని మరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో.. సంబేపల్లె మండలం అగ్రహారం గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం నాగన్న (75) తలకు గాయమై.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ..కొన్ని రోజులకు మరణించారు. ఇదే మండలం ఆదర్శ పాఠశాలకు సమీపంలో డిసెంబరు 5న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో కలకడ మండలం బొజ్జగుంటపల్లెకు చెందిన శివశంకర్‌నాయుడు (51) తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందారు.

● పెద్దమండ్యెం మండలం సిద్ధవరం పంచాయతీ బాటవారి పల్లెకు చెందిన మోహన, శేఖర్ మదనపల్లె పరిధిలో కర్నాటక సరి హద్దులో మూడు నెలల క్రితం ద్విచక్రవాహనంలో వెళ్తూ.. ప్రమాదంలో మృతి చెందారు. ఇదే మండలంలోని గోసువారిపల్లెకు చెందిన గంగప్ప (56) కోటకాడపల్లె వద్ద టీవీఎస్‌లో వెళ్తూ.. రోడ్డు ప్రమాదంలో గత నెలలో మృతి చెందారు.

ఇలా ద్విచక్ర వాహనాల రోడ్డు ప్రమాదాల్లో మృతులంతా.. దాదాపుగా హెల్మెట్‌ను ధరించకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే.. హైకోర్టు అటువంటి తీవ్ర వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఇకనైనా పోలీసులు కొరఢా ఝులిపించాలని, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కింద చిత్రంలో ఉన్న మహిళ పేరు ఉమామహేశ్వరి.. రైల్వేకోడూరుకు చెందిన ఈమె భర్త నరసింహరాజు అక్టోబరు 2న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో చనిపోయారు. అదే ద్విచక్ర వాహనంలో ఉన్న చిన్నకుమారుడు తీవ్రంగా గాయపడి.. కుడికాలును పూర్తిగా కోల్పోయాడు. వైద్యం చేయించడానికి సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు అయింది. ప్రస్తుతం ఆమె జీవచ్ఛవంలా.. బతుకుతూ.. చిన్నకొడుకుకు వైద్యం చేయించడానికి అవస్థలు పడుతోంది. తండ్రి చనిపోయి.. తమ్ముడు పూర్తిగా కాలును కోల్పోడమే కాకుండా.. ఇంకా ఆసుపత్రిలోనే ఉండడంతో.. ఆమె పెద్ద కొడుకు చదువు ఆపేసి.. హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ.. కుటుంబానికి అండగా ఉంటున్నాడు.



మృతుడు నరసింహరాజు (ఫైల్‌ఫొటో)
ఆవేదన చెందుతున్న ఉమామహేశ్వరి

సచివాలయంలో వైసీపీ వలంటీర్ దర్జా

● సిస్టం ముందు కూర్చొని ఆపరేటింగ్ ● డేటా చోరీ యత్నం అంటూ ఆరోపణలు



సచివాలయంలో సిస్టం ముందు దర్జాగా కూర్చున్న మాజీ వలంటీర్

బి.కొత్తకోట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ వలంటీర్లలో ఒకరిద్దరి హవా ఇంకా కొనసాగుతోంది అనేందుకు మండలంలోని గట్టు గ్రామ సచివాలయంలో శుక్రవారం వెలుగు చూసిన సంఘటన తార్కాణంగా నిలుస్తోంది. అప్పట్లో ప్రతి సచివాలయ పరిధిలో 15-20 మంది వలంటీర్లు జీతాలు తీసుకోగా వారిలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వలంటీర్లు ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు ఆన్‌లైన్ పనిలో సహాయ పడుతూ వారిని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. అనంతరం ప్రభుత్వం మారినా, ఆ వలంటీర్లను పక్కన పెట్టినా కొన్నిచోట్ల వారి హవా తెరవెనుక కొనసాగుతూనే ఉంది. శుక్రవారం గట్టు గ్రామ సచివాలయంలో ఉదయం 8-30కే కొంత మంది గ్రామస్తులు సచివాలయంలోకి వెళ్లారు. తీరా చూస్తే ఓ మాజీ వలంటీర్ యాసిన్ దర్జాగా సిస్టం ఎదుట కూర్చొని ఆప రేటింగ్ చేస్తున్నాడు. అతను ఆన్‌లైన్ సమా చారాన్ని చోరీ చేస్తున్నాడా? తప్పుడు సమాచా రాన్ని పొందుపరుస్తున్నాడా? అనేది తెలియకుండా తన పనిలో బిజీగా ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు నీకు ఇక్కడ ఏం పని.. సిస్టంలో ఏం చేస్తున్నావ్ అని ప్రశ్నించారు. అయినా ఆ మాజీ వలంటీర్ ఏ మాత్రం జంకు, గొంకు లేకుండా తాపీగా ఉండటం చూస్తే ఆ సచివాలయ అధికారులు అతనిపై ఎంత ఆధార పడ్డారో తెలుస్తోంది. ఈ విషయమై ఎంపీడీవో శంకరయ్యను వివరణ కోరగా.. మాజీ వలంటీర్ డేటా చోరీ ఏం చేయలేదని, సచివాలయ సిబ్బందికి సహాయం చేసేందుకు వచ్చాడని తెలిసిందన్నారు. దీనిపై శనివారం తాను సచివాలయానికి వెళ్లి విచారించి కలెక్టరుకు నివేదిక అందజేస్తానని తెలిపారు. కాగా ఈ ఘటనపై ఉన్నత స్థాయిలో విచారణ జరిగితే అసలు విషయం బయటప డుతుందని పలువురు పేర్కొంటున్నారు.


అడవిపల్లె ప్రాజెక్టు విలవిల

● ఐదేళ్లుగా రిజర్వాయర్ సమీపంలో అక్రమ మైనింగ్
● రాతికూసాల కోసం యథేచ్ఛగా పేలుళ్లు
● పట్టించుకోని ప్రభుత్వ శాఖలు
● సీపీఐ ఫిర్యాదుతో రంగంలోకి మైనింగ్ శాఖ

పీలేరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం అడవిపల్లె రిజర్వాయర్ పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంజీవని లాంటిది. నియోజకవర్గంలోని సుమారు 70 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 మండలాలకు తాగునీరు అందించేందుకు రూపొందించిన బృహత్తర ప్రాజెక్టు. అటువంటి ప్రాజెక్టు మనుగడకే ముప్పు వాటిల్లేలా ఆ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతోంది. రాతి కూసాల కోసం ఆ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ పేలుళ్ల కారణంగా ప్రాజెక్టు మనుగడ ప్రమాదంలో పడింది. గడిచిన ఏడేళ్లుగా యథేచ్ఛగా సాగిన ఆ అక్రమ పేలుళ్లపై ఇటీవల సీపీఐ పార్టీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారుల దృష్టి ఇటు మళ్లింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన మైనింగ్ శాఖ ఏడుగురిపై కేసు నమోదు చేసింది. అయితే మైనింగ్ శాఖ చర్యలు తూతూమంత్రంగా ఉన్నాయని, అసలైన వారిని వదిలేసి కూలీలపై కేసులు నమోదు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో..

కేవీపల్లె మండలం తీతవగుంటపల్లె, కేవీపల్లె, తువ్వపల్లె పరిసర ప్రాంతాల్లో హంద్రీ-నీవా పథకం కింద అడవిపల్లె ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు రూపకల్పన జరగకముందు అక్కడి ప్రాంతంలోని స్థానికులు చాలా తక్కువ స్థాయిలో బండలు కొట్టుకుని జీవనం సాగించేవారు. ప్రాజెక్టు రూపకల్పన జరిగి అక్కడి భూములకు పరిహారం చెల్లించి గ్రామస్తులకు పునరావాసం కల్పించి అక్కడి నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. దీంతో అక్రమార్కుల కన్ను ఆ ప్రాంతంలోని గుట్టలు, కొండలపై పడింది. రిజర్వాయర్ ప్రాంతం బాగా మారుమూల ప్రాంతంలో ఉండడంతో ఎటువంటి జనసంచారం లేకపోవడం, అధికారులు రావాలన్నా సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, ఆ ప్రాంతంలో దొరికే రాతి కూసాలు, కంకర బాగా నాణ్యతగా ఉండడంతో చాలా మంది అక్రమార్కులు కూసాల కోసం అక్రమంగా క్వారీలు ప్రారంభించారు. ప్రాజెక్టు ఎగువ భాగంలోని కొండల్లో ఐదు, దిగువ భాగంలో మూడు అనధికారికంగా క్వారీలు ఏర్పాటు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా తమ కార్యకలాపాలు ప్రారంభించారు. గత వైసీపీ పాలనలో వీరి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా అభివృద్ధి చెందింది. క్వారీల యజమానులు అప్పటి అధికార పార్టీ నేతలే కావడంతో ప్రభుత్వ అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూసేందుకు సాహసించలేదు. దీంతో వారు ఇష్టారాజ్యంగా పేలుళ్లు సాగిస్తూ, కొండలను కరిగించి కూసాలుగా మలిచి వాటిని మన రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు.



రాతికూసాల కోసం అక్రమ క్వారీ నిర్వహిస్తున్న ప్రదేశం

స్వంతంగా రోడ్లు, విద్యుత్ సౌకర్యం

అక్రమ క్వారీల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేయడం, అనుమతులు తెచ్చుకుని కార్యకలాపాలు ప్రారంభించడం వంటి నిబంధనలను అక్రమార్కులు పాటించలేదు. ప్రభుత్వంతో తమకు పనే లేదన్నట్లు కొండల్లో స్వంతంగా రోడ్డు వేసుకోవడమే కాకుండా విద్యుత్ సౌకర్యం కోసం స్వంతంగా జనరేటర్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా పెద్దపెద్ద మెషీన్ల ద్వారా పేలుళ్లు సాగించడమే కాకుండా పెద్ద బండరాళ్లను తమకు కావాల్సిన సైజుల్లో మలుచుకునేవారు. చిత్తూరు జిల్లా యాదమర్రి వద్దనున్న గ్రామాలతో పాటు తమిళనాడు రాష్ట్రం నుంచి కూలీలను పిలిపించుకుని ఎటువంటి అడ్డూఅదుపు లేకుండా వ్యాపారాలు సాగించారు. అదే సమయంలో స్థానికులు ఎవరైనా జీవనోపాధి కోసం బండలు కొట్టుకుంటామంటే వారిని నయానో భయానో బెదిరించడం, అలా లొంగని వారితో కప్పాలు కట్టించుకుని అనుమతులు ఇవ్వడం లాంటి సమాంతర పరిపాలన సాగించారు. అడవిపల్లె ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న పేలుళ్ల కారణంగా ప్రాజెక్టు ఆనకట్టలకు ముప్పు వాటిల్లుతుందని తెలిసినా అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అక్రమ పేలుళ్ల వల్ల ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని లక్ష్మిరెడ్డిగారిపల్లె, మూల, ఇర్రివాండ్లపల్లె, తీవవగుంటపల్లె, తిమ్మాపురం గ్రామాల ప్రజలు పలుమార్లు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

సీపీఐ ఫిర్యాదుతో వెలుగులోకి..

గడిచిన ఏడేళ్లుగా యథేచ్ఛగా సాగిపోయిన ఈ అక్రమ మైనింగ్ గురించి గత సోమవారం సీపీఐ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. వారి ఫిర్యాదుతో మైనింగ్ అధికారులు హడావిడిగా అడవిపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆ తనిఖీల్లో క్వారీలు నడుపుతున్న ముఖ్య నేతలను కాకుండా అధికారులు తనిఖీ చేసినప్పుడు అక్కడ పనిచేస్తున్న కూలీలపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై స్థాని కుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కూలీలను కాకుండా వాటిని నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ క్వారీలపై ఉక్కుపాదం మోపి, ప్రాజెక్టును పరిరక్షించాలని వారు కోరుతున్నారు.

అవి అక్రమ క్వారీలే..

అడవిపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో నడుస్తున్నవి అక్రమ క్వారీలు. వాటికి ఎటువంటి అనుమతులు లేవు. మాకు సమాచారం అందిన వెంటనే కేవీపల్లె పోలీసుల ద్వారా ఏడుగురిపై కేసు నమోదు చేయడమే కాకుండా ఒక హిటాచీను కూడా స్వాధీనం చేసుకున్నాం. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూస్తాం.

- సుబ్రహ్మణ్యం, ఏడీ, మైనింగ్ శాఖ, రాయచోటి



కూలీల కోసం వేసిన రేకుల షెడ్డు



వాహనాల కోసం గుట్టల్లో సిద్ధం చేసుకున్న రోడ్డు

తప్పుడు పత్రాలతో కబ్జా చేశారు

● కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గాలివీడుకు చెందిన ప్రజలు

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోర్టులో కేసు నడుస్తున్నా తమ భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేసేందుకు యత్నిస్తున్నారంటూ ఓ వృద్ధురాలు శుక్రవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. గాలివీడు గ్రామానికి చెందిన హుస్సేన్‌సాబ్‌కు అదే గ్రామంలోని సర్వే నంబరు 475లోని భూమిపై 456/88 నంబరుతో ప్రభుత్వం డీకేటీ పట్టా జారీ చేసింది. ఆయన మరణానంతరం ఆయన భార్య షేక్ షంషాద్ (73) ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవించేది. 2022 అక్టోబరు 22వ తేదీ రాత్రి వేళలో షేక్ అహ్మద్‌బాషా, షేక్.జిలానీబాషా ఆ భూమిలోని పైరును దున్నేసి కబ్జా చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ఈ విషయంపై ఆర్‌వోఆర్ కోర్టులో కేసు కూడా నడుస్తోందని, అయినా, ఆ భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేసేందుకు తహసీల్దార్ చూస్తున్నాడని అర్జీలో పేర్కొన్నారు. ఈ విషయంపై కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన అనంతరం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

15 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● ఐదుగురు కూలీల అరెస్టు

రాజంపేటటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేట మండల పరిధిలోని అనంతసముద్రం సమీపంలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 15 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎన్.సుధాకర్ తెలిపారు. శుక్రవారం రాజంపేట పట్టణంలోని రూరల్ పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పీఎస్ రాజ్‌కుమార్, ఎస్‌బీవో పోలీసు సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించి రూ.5 లక్షల విలువైన దుంగలు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూరల్ సీఐ డీవీ రమణ, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు. అరెస్ట్ చేసినవారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు.

మంచు మాటున ప్రమాదం

● వేకువజామున ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం

● జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా గమ్యం చేరవచ్చు



రహదారుల్లో కమ్ముకున్న పొగమంచు

బద్వేలు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా చలికి జనం గజగజ వణుకుతున్నారు. చలి మాత్రమే కాదు.. విపరీతమైన పొగమంచు కమ్ముకుంటోంది. గతంలో తెల్లవారుజామున పొగమంచు వచ్చేది. ఇప్పుడు పగలంతా మంచు ఉంటోంది. ముఖ్యంగా తెల్లవారు జామున నాలుగుగంటల నుంచి ఉదయం 8గంటల వరకు దట్టమైన పొగమంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చలితీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. సాయంత్రం చీకటి పడకముందే చలి మొదలవుతోంది. ముఖ్యంగా వాహన చోదకులు చలితో ఇబ్బందులు పడుతున్నారు.

అసలే రహదారులు అంతంత మాత్రంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణరోడ్లు, పల్లె కూడళ్ల వద్ద మలుపులు, ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించే పరిస్థితి లేకపోవడంతో ఇలాంటిచోట్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల కొన్ని రహదారుల్లో ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. అయితే వాహనచోదకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో పొగమంచులో ప్రయాణాలు చేసే వారికి పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు.

మంచుతో ప్రమాదం

- దట్టంగా మంచు కమ్ముకోవడం వలన వాహనదారులు రహదారిని అంచనా వేయలేరు. దారి సరిగా కనిపించదు.
- మంచు కారణంగా రోడ్డు చెమ్మగా ఉండటంతో వాహనాలు వేగంగా నడిపే క్రమంలో అదుపుతప్పే అవకాశం ఉంది.
- కొందరు ప్రధాన రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తుంటారు. అదే మార్గంలో వచ్చే వాహనచోదకులు పొగమంచు కారణంగా వాటిని గుర్తించలేక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.
- దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లకు సరైన విశ్రాంతి, నిద్రలేక వేకువజామున చల్లగాలులకు కునుకుపడుతోంది. దీనికి తోడు పొగమంచు కారణంగా ఎదురుగా వాహనాలు సమీపంలోకి వచ్చేవరకు గుర్తించలేకున్నారు. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- కొందరు తెల్లవారుజామునే లేచి రహదారుల్లో జాగింగ్, వాకింగ్ చేస్తున్నారు. పొగమంచు కారణంగా వీరిని వాహనచోదకులు గుర్తించే అవకాశం లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత సీజన్‌లో పొగమంచు కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికం. ఈ క్రమంలో రహదారుల్లో నిత్యం వాహన చోదకులకు భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులకు స్టిక్కర్లు వేయిస్తున్నాం. వాహన తనిఖీల్లో భాగంగా మంచువల్ల ఎదురయ్యే సమస్యలను వివరిస్తున్నాం. ముఖ్యంగా ఆటోలు, వ్యాన్లు, ద్విచక్రవాహనాలు నడిపేవారు పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు. మితిమీరిన వేగం అనర్థదాయకం. సీటు బెల్టు, హెల్మెట్ వాడకం శ్రేయష్కరం.

- రాజగోపాల్ యాదవ్, సీఐ, బద్వేలు

పాటించాల్సిన జాగ్రత్తలు

- మంచుతీవ్రత అధికంగా ఉంటే ఆ ప్రభావం తగ్గే వరకు ప్రయాణం వాయిదా వేసుకోవాలి. ప్రయాణ సమయంలో మంచుతీవ్రత అధికమై రహదారి కన్పించకుంటే సురక్షిత ప్రాంతంలో వాహనాలు నిలుపుదల చేయాలి.
- మంచు కురిసే సమయంలో వాహనాలు నెమ్మదిగా నడపాలి. ఎదురుగా వచ్చే వాహన చోదకులు గుర్తించేలా వాహన హెడ్‌లైట్ ఆన్ ఆఫ్ చేయడం లేదా ఆఫ్ చేయడం శ్రేయస్కరం.
- ప్రయాణ సమయంలో బ్రేక్, సైడ్ ఇండికేటర్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖ్యంగా రోడ్ల మలుపుల వద్ద కుడి ఎడమలు స్పష్టం చేసే సిగ్నల్ లైట్స్ ఎదుటి వాహనదారులను అప్రమత్తం చేస్తాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్.. కారు, వ్యాను చోదకులు సీటు బెల్టు పెట్టుకోవాలి.
- వేకువజామున నిత్యం ప్రయాణించే కూరగాయలు, పాలు, వాటర్ ట్యాంకులు, పత్రికల వాహనాలు కచ్చితంగా వాహనం ముందు, వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు అతికించాలి.

మేకల మందపై చిరుతపులి దాడి

● ఒక మేక మృతి

● కనిపించని ఐదు జీవాల జాడ

● కుక్కల సాయంతో ప్రాణాలతో బయటపడ్డ కాపరి

● కనుగొండ సమీప గ్రామాల్లో తీవ్ర భయాందోళన

ములకలచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం సమీపంలో గల కనుగొండ రిజర్వు అటవీ ప్రాంతంలో మేకల గుంపుపై చిరుత పులి దాడి చేసింది. దీంతో ఒక మేక మృతి చెందగా.. మరొకటి తీవ్రంగా గాయపడింది. ఐదు మేకల జాడ కన్పించలేదు. కాగా మేకల కాపరిపై కూడా చిరుత పులి దాడి చేసేందుకు ప్రయత్నించగా.. తోడుగా ఉన్న కుక్కల సహాయంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనతో అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గ్రామాల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే...

పెద్దపాళ్యంలోని బీసీ కాలనీకి చెందిన పాళ్యం నరసింహులు మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి 120 మేకలు ఉన్నాయి. ప్రతి రోజు గ్రామానికి సమీపంలో ఉన్న కనుగొండ అటవీ ప్రాంతంలోకి మేత కోసం మేకలను తీసుకెళ్తుంటాడు. రోజూలాగే గురువారం మేత కోసం కనుగొండ అటవీప్రాంతంలోని పెద్దజారుబండ పడమటి వైపున తోలుకెళ్లాడు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో మేకల మందపై చిరుత పులి ఒక్కసారిగా దాడి చేసింది. వరుసగా ఐదు మేకలను అడివిలోకి లాక్కెళ్లింది. మరో మేకను గొంతు దగ్గర కరిచి చంపగా.. మరో మేక గొంతును నోటితో పట్టుకోగా కాపరి నరసింహులు తీవ్ర భయాందోళనకు గురై వణికిపోయాడు. చిరుతపులి కాపరిపై కూడా దాడి చేసేందుకు యత్నించింది. కాపరి వెంట ఉన్న రెండు కుక్కలు గట్టిగా అరవడంతో పాటు నరసింహులు గట్టిగా అరవడంతో చిరుతపులి అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయాన్ని కాపరి కుటుంబీకులకు తెలియజేయడంతో అతని కుమారుడు అశోక్, మరికొందరు సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లారు. తీవ్రంగా గాయపడ్డ మేకను, చనిపోయిన మేకను గ్రామంలోకి తీసుకొచ్చారు. గాయపడ్డ మేక గొంతు వద్ద చికిత్సలు చేయించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి కాపరిని విచారించి వెళ్లిపోయారు. కనీసం ఘటన జరిగిన ప్రాంతాన్ని కూడా పరిశీలించలేదని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. కాగా కుక్కలు లేకుంటే తన



రోదిస్తున్న మేకల కాపరి నరసింహులు

ప్రాణాలు కూడా పోయేవని, కుక్కలు గట్టిగా మొరగడంతో చిరుత పులి వెళ్లిపోయిందని గొర్రెల కాపరి నరసింహులు రోధించాడు. ఈ ఘటనతో కాపరులు శుక్రవారం అడివిలోకి గొర్రెలు, మేకలు తీసుకెళ్లేందుకు భయపడి గ్రామ సమీపంలోనే మేపారు. రక్తం రుచి చేసిన చిరుతపులి సమీప గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని గ్రామస్తులకు అవగాహన కల్పించి భయం పోగొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!

● ఎట్టకేలకు ప్రారంభమైన పెద్దేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

● రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు

● రెండేళ్ల తరువాత పనులు తిరిగి ప్రారంభం

ములకలచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం వద్ద ముంబై - చెన్నై జాతీయ రహదారిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణ పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నత్తకు నడక నేర్పేలా జరిగిన పనుల్లో కదలిక వచ్చింది. రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు చేశారు. దేశంలోనే అతి పొడవైన జాతీయ రహదారి(ఎన్‌హెచ్-42) కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో తరచూ రైల్వే గేటు పడుతుండడంతో వాహనాలు బారులు తీరి నిలిచిపోతున్నాయి. తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేవి. జాతీయ రహదారిలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని సమయం ఆదా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్దపాళ్యం రైల్వేగేటుపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.49కోట్లు మంజూరు చేసింది. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వాహనాలు రైల్వే గేటు నుంచి కాకుండా బ్రిడ్జిపై వెళ్తాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దపాళ్యం ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. ఏడాదిన్నర పాటు పనులు జరగడంతో బ్రిడ్జి నిర్మాణం పనులు చివరి దశకు చేరాయి. ఇరువైపులా రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే రైల్వేగేటుపై వెళ్తున్న బ్రిడ్జిపై కొంత భాగం పనులు నిలిచిపోయాయి. ఇక్కడ దిమ్మెలు ఏర్పాటు చేస్తే పనులు ముగుస్తాయన్న సమయంలో రెండేళ్ల పాటు నిలిపేశారు. దీంతో బ్రిడ్జి నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా శుక్రవారం



పెద్దపాళ్యం రైల్వేగేటుపై ఏర్పాటు చేసిన బూస్టింగ్ గిర్డర్

ఒక బూస్టింగ్ గిర్డర్‌ను భారీ యంత్రాల సహాయంతో రైల్వేగేటుపై ఏర్పాటు చేశారు. ఈ పనులను ఎన్‌హెచ్ ఏఈ మధుసూదన్, రైల్వే శాఖ పీడబ్ల్యుఐ శ్రీనివాసులురెడ్డి, టీఆర్‌డీ జగదీశ్వరన్ పర్యవేక్షించారు. అయితే మరో బూస్టింగ్ గిర్డర్‌ను తయారు చేయాల్సి ఉందని, ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని, ప్రస్తుతానికి ఇప్పుడు ఏర్పాటు చేసిన బూస్టింగ్ గిర్డర్‌కు తుది పనులు పూర్తి చేసి ఫ్లై ఓవర్‌పై రాకపోకలు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

రాజంపేట చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు

రాజంపేటటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణానికి చెందిన 18 నెలల బుడతడు షేక్ మహ్మద్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో (వరల్డ్ కింగ్స్) చోటు దక్కించుకున్నాడు. ఈ ఏడాది నవంబరు 30న ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో అర్హత సాధించగా డిసెంబరు 19న ప్రశంసా పత్రాన్ని, మెడల్స్‌ను కొరియర్ ద్వారా మహమ్మద్ తల్లిదండ్రులకు పంపించారు. ఓబులవారిపల్లె మండలంలో వీఆర్వోగా పనిచేసే షేక్ ముజీబ్ రాజంపేట పట్టణం ఈడిగపాలెంలో నివాసం ఉంటున్నాడు. షేక్ ముజీబ్, మసూదా బేగం దంపతులకు షేక్ మహమ్మద్ అనే 18 నెలల కుమారుడు ఉన్నాడు. ఈ చిన్నారి ఏడాది వయసు నుంచే పలు రకాల జంతువులు, కూరగాయలు, పండ్లు, స్వాతంత్ర్య సమరయోధులు, వాహనాలు, శరీరావయవాలు పలువురు సినిమా హీరో, హీరోయిన్లు, 19 రకాల ఆట వస్తువులు, వివిధ ఆకృతులు, వాహనాల విడిభాగాలు తదితరాలను టక్కున గుర్తించి చెప్పేస్తున్నాడు. ఈ విషయాలన్నింటిని వారి తల్లిదండ్రులు వీడియో రికార్డు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు (వరల్డ్ కింగ్స్) వారికి సమాచారం అందించారు. ఆ సంస్థ ప్రతినిధులు ఈ వీడియో రికార్డులను పరిశీలించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ముజీబ్‌కు ప్రశంసాపత్రం, మెడల్స్‌ను పంపుతూ, వరల్డ్ కింగ్స్ టాప్ రికార్డ్సు జాబితాలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో అత్యంత తెలివైన వాడిగా చిన్నారిని గుర్తించారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తమ కుమారుడు షేక్ మహ్మద్ ఏడాది వయసు నుంచే ఏదైనా టక్కున గుర్తించి తెలియజేస్తాడని తెలిపారు. ఈ విధంగా ఏ ఆకృతిని చూపినా వెంటనే పేరు చెబుతాడన్నారు. కొందరి సలహా మేరకు తాము అన్ని విషయాలను వీడియో రికార్డింగ్ చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులకు పంపడంతో వారు ఈ ప్రశంసాపత్రాన్ని, మెడల్స్ పంపుతూ రికార్డులో నమోదు చేయడం తమకు ఆనందదాయకమన్నారు.



వివిధ ఆకృతులను గుర్తిస్తున్న చిన్నారి మహ్మద్

'అయ్యప్ప ఆలయాన్ని స్వాధీనం చేసుకోండి'

మదనపల్లె/కలికిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ మదనపల్లె గ్రూప్ టెంపుల్ ఈవోను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జీవో నెంబరు. 294 ఉత్తర్వులు జారీచేశారు. స్థానిక శివనగర్‌లో అయ్యప్ప స్వామి ఆలయం ఉంది. గతంలో దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని ఆలయ అభివృద్ధి పేరుతో ఏర్పాటైన కమిటీ వినతి మేరకు 2022 సెప్టెంబరులో అప్పటి ప్రభుత్వం ఐదేళ్ల పాటు అభివృద్ధి నిర్వహణ కోసం అప్పగించింది. అయితే ఈ కమిటీపై తరచూ అటు అధికారులు, ప్రభుత్వానికి భక్తుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. ముఖ్యంగా ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో ఫిర్యాదులు వస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రజల నుంచి భక్తుల నుంచి చందాలు వసూలు చేస్తున్నారని వాటికి సరైన లెక్కలు, రికార్డుల నిర్వహణ లేదని ప్రధాన అభియోగం. అలాగే ఆలయ కమిటీలో ప్రభుత్వం అనుమతి లేకుండా సభ్యులను మార్చేశాలరని తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారని వెల్లడైంది. ఈ పరిణామాలన్నింటిని పరిశీలించిన దేవదాయశాఖ ఆలయంపైన ప్రభుత్వం పైన చెడ్డపేరు వస్తుందని ఈ నిర్ణయం తీసుకుంది.

రోడ్డు పనికిపోతే దాడి చేశారు

సంబేపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కూలి పనులకు వెళితే తమపై దాడి చేయడంతో పాటు, చికిత్స పొందుతున్న తమపైనే కేసు కూడా పెట్టారని కొత్త వడ్డెపల్లెకు చెందిన జ్యోతి, మోహన్, హరీశ్, పుష్పాంజలి, రామాంజులు, అచ్చన్న ఆవేదన వ్యక్తం చేస్తుండగా, కౌంటర్ కేసు కోసమే వారు ఆస్పత్రిలో చేరారని సీఐ వివరిస్తున్నారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని నారాయణరెడ్డి గ్రామం పాలెంవాండ్లపల్లె నుంచి కొత్త వడ్డెపల్లె వరకు బీటీ రోడ్డు పనులు చేస్తున్నారు. శుక్రవారం పాలెంవాండ్లపల్లెకు చెందిన చంద్రయ్య ఈ రోడ్డు పనులు జరగకుండా అడ్డుకోవడంతో కొత్తవడ్డెపల్లె గ్రామస్తులు అతనితో ఘర్షణపడ్డారు. ఈ సందర్భంగా కూలి పనులకు వెళ్లిన తమపై చంద్రయ్య, సురేశ్, లక్ష్మీదేవి, బాలాజీ, సుమతి, అనిత తమపై దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో మోహన్ కాలు ఫ్రాక్చర్ అయిందన్నారు. దాంతో తాము ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటుండగా, తమపైనే కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఎస్ఐ భక్తవత్సలం వివరణ కోరగా... కొత్తవడ్డెపల్లె గ్రామస్తులు చంద్రయ్యకు చెందిన కంచె తొలగించడంతో పాటు దాడికి పాల్పడ్డారని, కౌంటర్ కేసు కోసమే వారు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు వివరించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి, మోహన్, హరీష్, పుష్పాంజలి, రామాంజులు, అచ్చన్న

ఆక్రమణదారులపై ఉక్కుపాదం



యంత్రాలతో అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండగా గుమికూడిన జనం

● ఆర్‌అండ్‌బీ స్థలంలో రేకుల షెడ్లు తొలగింపు

● అక్రమ నిర్మాణాలు నేలమట్టం

● దూకుడు పెంచిన రెవెన్యూ, పోలీసు అధికారులు

గాలివీడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను, నిర్మాణాలను నేలమట్టం చేసి అధికారులు దూకుడు పెంచారు. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి ఉక్కుపాదం మోపుతూ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే...

గాలివీడు పట్టణంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో సర్వే నెంబరు 2266లో ఉన్న 1.80 ఎకరాల భూమిలో ఆక్రమణలు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే తరుణంలో స్థానికుల ఫిర్యాదు మేరకు కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు కదిలిన స్థానిక రెవెన్యూ యంత్రాంగం, ఆర్‌అండ్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు 11 మంది ఆక్రమణదారులకు తాఖీదులు అందజేశారు. 15 రోజులు గడువు ఇచ్చిన అనంతరం సిక్స్ నోటీస్ ఇచ్చిన అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను జేసీబీ యంత్రాలతో తొలగించారు. అయితే స్థానికులు కొందరు తమ నిర్మాణాలు తొలగించాలంటే ఎదురుగా ఉన్న మరికొన్ని అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఎదురుతిరిగారు. దీంతో తహసీల్దార్ భాగ్యలత, ఎస్ఐ రామక్రిష్ణ సమన్వయంతో చాకచక్యంగా వ్యవహరించి ఆక్రమణలను తొలగించారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన రెవెన్యూ, పోలీసు అధికారుల తీరును ప్రజలు అభినందిస్తున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తత

గత 30 సంవత్సరాలుగా ఆర్‌అండ్‌బీ స్థలంలో రేకుల షెడ్లు నిర్మించుకుని వ్యాపారాలు, నివాసాలు ఉన్న వారికి రేకుల షెడ్లు తొలగించాలని గత రెండు నెలలుగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిని ఖాతరు చేయకపోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో అక్రణ నిర్మాణాలను తొలగించడానికి ఎక్సకవేటర్లతో ప్రయత్నం చేయగా అక్రమ నిర్మాణదారులు తమ నివాసాలను తొలగించవద్దంటూ అడ్డుకున్నారు. స్థానికుడు ఒకరు రేకుల షెడ్లపైకి ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానంటూ హల్‌చల్ చేశాడు. ఎట్టకేలకు అక్రమ నిర్మాణాలు తొలగించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కానిస్టేబుల్ బెదిరించాడని.. విద్యార్థి ఆత్మహత్యాయత్నం

రాయచోటిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ బెదిరించడంతో ఓ విద్యార్థి మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్న కథనం సోషల్ మీడియాలో శుక్రవారం హల్‌చల్ చేస్తోంది. రాయచోటి మండలం మాధవరం గ్రామం కంచరపల్లి కాలనీకి చెందిన కాల్వపల్లి రామాంజనేయులు శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, అతని తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం కువైత్‌లో ఉన్నారు. గురువారం రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ధర్మా కంచరపల్లెకు వచ్చి రామాంజనేయులను ఇంటి నుంచి బయటకు లాగి, ఓ అమ్మాయి నుంచి బంగారం తీసుకున్నావని ఆరోపించడంతో పాటు, నానా దుర్భాషలాడినట్లు బంధువులు తెలిపారు. తనకు ఏమీ తెలియదని చెబుతున్నా వినకుండా కొట్టడంతో మనస్తాపానికి గురై ఇంట్లోకి వెళ్లి గుళికల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. వెంటనే అతన్ని రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి పరిస్థితి సీరియస్‌గా ఉందని పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో, వెంటనే తిరుపతిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఆ విషయం తనకు తెలియదని, ఎటువంటి ఫిర్యాదు అందలేదని సమాధానమిచ్చారు.



చికిత్స పొందుతున్న విద్యార్థి

జిల్లాలో 31 వేల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం

కలికిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో 30950 ఎకరాలకు సూక్ష్మ సాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిణి వై.లక్ష్మీ ప్రసన్న తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అమర్చడానికి 30 కంపెనీలను గుర్తించామని, ముందుకొచ్చిన రైతులందరికీ సబ్సిడీపై వెంటనే పరికరాలు అమర్చేందుకు కంపెనీలు కూడా సిద్ధంగా వున్నాయని ఆమె చెప్పారు. వాయల్పాడు, కలికిరి, కలకడ, పీలేరు, కేవీ పల్లె మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల వ్యవసాయ, పశుసంవర్ధక సహాయకులతో కలికిరి కేవీకేలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంఐఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ 5 ఎకరాల్లోగా విస్తీర్ణం కలిగిన రైతులకు 90 శాతం, పది ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అమర్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రిప్‌తో సాగు చేసిన పంటల నుంచి తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయాన్ని రాబట్టవచ్చని వివరించారు. మొత్తం 30 కంపెనీల్లో రైతులకు నచ్చిన కంపెనీ నుంచి పరికరాలు అమర్చే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు స్థానిక రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. నమోదైన రైతుల పొలాల్లో వెంటనే సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతు నమోదు చేసుకున్నప్పటి నుంచి పరికరాలు అమర్చడం పూర్తయ్యే వరకూ వివిధ దశల్లో చేయాల్సిన పనులకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మదనపల్లె, పీలేరు ఉద్యాన అధికారులు ఈశ్వరప్రసాద్, సుకుమార్‌రెడ్డి, ఎంఐడీసీ హరినారాయణ, ఎంపీఏవో దుర్గయ్య, ఉమాదేవి, వివిధ డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చు... అధిక దిగుబడులు

డ్రమ్‌సీడర్‌తో వరి సాగు.. రైతులకు లాభదాయకం


డ్రమ్ సీడరు విధానంతో వరిని ఎలా నాటాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో వర్షాలు సకాలంలో కురవక నార్లు పోయడం, నాట్లు వేయడం ఆలస్యం కావడంతో వరి దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా నారును నెలరోజులు పెంచి నారు తొలగించి నాటు వేయడానికి అధిక ఖర్చు కావడమే కాక నీటి వాడకం కూడా అధికమవుతుంది. ఈ నేపథ్యంలో రైతులు డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

డ్రమ్ సీడర్‌తో సాగు - ఉపయోగాలు

డ్రమ్‌సీడర్ పద్ధతిలో నార్లు పెంచి నాటు వేయాల్సిన అవసరం లేదు. దీంతో నాటుకు అవసరమైన కూలీల ఖర్చును ఆదా చేయవచ్చు విత్తన మోతాదును సగానికి సగం తగ్గించవచ్చు. డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తినప్పుడు ఒక చదరపు మీటరుకు ఉండాల్సిన మొక్కల సంఖ్య ఖచ్చితంగా ఉండడంతో వరి దిగుబడులు నాటు వేసిన వాటికంటే అధికంగా ఉంటాయి. వర్షాలు ఆలస్యమై నీరు సకాలంలో అందనప్పుడు కాల్వల ద్వారా నీటి విడుదల ఆలస్యమైనప్పుడు ముదురు నార్లతో నాట్లు వేస్తారు. దీని వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. అలాంటి పరిస్థితుల్లో డ్రమ్ సీడరు పద్ధతి అనువుగా ఉంటుంది. సాళ్ల మధ్యలో యంత్రాలతో అంతరకృషికి వీలుంటుంది. నాటు వేసిన వరి కన్నా 5 - 7 రోజులు ముందుగా డ్రమ్ సీడరుతో వేసిన వరి కోతకు వస్తుంది.

నేల తయారీ...

డ్రమ్ సీడరుతో వరి నాటే సమయంలో సాధారణ పద్ధతిలో కంటే వీలైనంత బాగా చదును చేసుకోవాలి. ఎత్తు పల్లాలు లేకుండా సమాంతరంగా ఉండడం చాలా అవసరం. పొలంలో నీరు నిల్వ ఉండకూడదు కాబట్టి నీరు ఎక్కువైతే బయటికి పోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా విభజించుకుంటే చదును చేయడానికి, నీరు పెట్టడానికి, విత్తనం చల్లడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. విత్తే సమయానికి నీరు లేకుండా బురద ఉంటే చాలు. ఇసుక శాతం ఎక్కువగా ఉన్న నేలలో విత్తాలనుకున్న రోజే ఆఖరి దమ్ము చేసి చదను చేసి పలుచటి నీటి పొర ఉండేట్లు చూసుకోవాలి. బంక నేలల్లో ఆఖరి దమ్ము చేసి చదను చేసిన మరుసటిరోజు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు

రకాన్ని బట్టి ఎకరాకు 10 - 15 కిలోలు అవసరమవుతాయి. కాండం గట్టిగా ఉండి వేరు వ్యవస్థ దృఢంగా ఉండి పడిపోని రకాలు మిక్కిలి అనుకూలం. ఆయా ప్రాంతానికి అనువైన, రైతుకు ఇష్టమైన ఏ రకమైనా ఈ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు.

విత్తన శుద్ధి

డ్రమ్‌సీడరు ద్వారా విత్తుకునేటప్పుడు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజయ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 12 గంటలు నానబెట్టి 24గంటలు మండెకట్టి కొద్దిగా ముక్కు పగిలిన గింజలను వాడకోవాలి.

విత్తే విధానం ఇలా..

డ్రమ్ సీడరు డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. గింజలు రాలడానికి వీలుగా ప్రతి డ్రమ్‌లో కేవలం 3/4 వంతు మాత్రమే మొలకెత్తిన గింజలను నింపాలి. గింజలు నింపిన డ్రమ్ సీడరు లాగితే 8 వరుసల్లో వరుసకు వరుసకు మధ్య 20 సెం.మీ దూరంలో గింజలు పడతాయి. వరుసల్లో కుదురుకు కుదురుకు మధ్య దూరం 5 - 9 సెంమీ ఉంటుంది. ఒక్కో కుదురులో 5 -8 గింజలు పడడం జరుగుతుంది. కొన్ని అనివార్యకారణాలతో కుదురులోని గింజలు 50 శాతం దెబ్బతిన్నా మిగిలిన 50శాతం గింజల నుంచి వచ్చిన మొక్కల సాంద్రత సరిపోతుంది. రకాన్ని బట్టి గింజలు పడడాన్ని బట్టి రంధ్రాలను స్టాపర్స్‌తో మూసుకోవాలి. సన్న గింజ రకాలకు రంధ్రం వదిలి రంధ్రం మూసివేయాలి. 16 వరుసలకు అడుగు వెడల్పు కాలిబాట ఉంచుకోవాలి. తాడు ఉపయోగించి డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి. ఆయా ప్రాంతాలకు మరియు రకాలకు సిఫార్సు చేసిన ఎరువులనే డ్రమ్ సీడరు పద్ధతిలో సాగు చేసిన వరికి వాడుకోవాలి.

నీటి యాజమాన్యం

విత్తిన తరువాత మొదట్లో నీరు లేకుండా బురదగా మాత్రమే ఉండి డ్రమ్ సీడరుతో సాగు - అవరోధాలు డ్రమ్‌సీడరు పద్ధతి చౌడు నేలలకు, నీట ముంపునకు గురయ్యే ప్రాంతాలకు అనువు కాదు.

పంట బాగా చేతికి వస్తుంది



డ్రమ్ సీడరు విధానంతో వరి పంట సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ విధానంతో రైతులకు కూలీల ఖర్చు, నీటి వాడకం తగ్గుతుంది. పంట కూడా బాగా చేతికి అందుతుంది.

- సాయిజ్యోతి,మండల వ్యవసాయాధికారి

పశువుల వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

● పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు శారదమ్మ

కడప రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా పశువులకు వచ్చే వ్యాధులను నియంత్రించడానికి పశుసంవర్ధకశాఖ సమర్థవంతమైన చర్యలు చేపడుతోందని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. 2024-25 ఆర్థిక నాల్గవ త్రైమాసికంలో చేపట్టాల్సిన వైద్యసేవలు, టీకాల కార్యక్రమాలు ఇతర వైద్యసేవల గురించి క్షేత్రస్థాయి సిబ్బందికి ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అంతేకాకుండా జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు రూ.13కోట్ల విలువ కలిగిన మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పశువుల మందులు, టీకాల వినియోగంలో పారదర్శకత ఉండాలని వినియోగ వివరాలను ఖచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలి

కడప రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలని కడప జిల్లా పోర్ట్ పోలియో(హైకోర్టు) జడ్జి రామకృష్ణ ప్రసాద్‌ను కోరినట్లు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు తెలిపారు. ఈ మేరకు కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, సభ్యులు జయరామిరెడ్డి, చిన్నయ్య తదితరులతో శుక్రవారం అమరావతిలోని హైకోర్టులో జడ్జి రామకృష్ణ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న ఈగిల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విషయమై జడ్జి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని చెప్పారన్నారు. అనంతరం హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కవలడానికి ప్రయత్నించగా వీలుపడలేదని.. చాంబర్‌లో రెప్రజెంటేషన్ ఇచ్చామన్నారు.

వివాహేతర సంబంధంతో భర్తను హత్యచేయించిన భార్య

● భార్య, ప్రియుడితో సహా నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రఫీ, ఎస్సై విద్యాసాగర్

కొండాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా యల్లనూరు గ్రామానికి చెందిన సురేశ్ (36) ఈ నెల 17న మండలంలోని లావనూరు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు హత్యగా నిర్ధారించారు. వివాహేతర సంబంధం కారణంగా అతని భార్య, ప్రియుడు కలిసి హత్య చేయించారని పోలీసులు వెల్లడించారు. శుక్రవారం కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ విద్యాసాగర్‌లు వివరాలు వెల్లడించారు. యల్లనూరు గ్రామానికి చెందిన చిన్నగుల్లోబన్నగారి సురేశ్ భార్య వీరకుమారికి కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన గజ్జప్పగారి బాబుతో వివాహేతర సంబంధం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరూ కలిసి ఊరు వదిలి వెళ్లిపో యారు. ఆమె తిరిగి భర్త వద్దకు వచ్చినప్పటి నుంచి ఇద్దరికి గొడవలు జరిగేవి. ఆ తర్వాత ఆమె పుట్టింటికి వెళ్లి ఉంటోంది. ఈ నేప థ్యంలో వీరకుమారి, బాబు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. సురేశ్ ఉంటే తమకు అడ్డువస్తాడని సురేశ్ హత్యకు పన్నాగం పన్నారు. ఈ నేపథ్యంలో బాబు స్నేహితుడు వెలిదండ్ల సుభాన్‌కు రూ.1,00,000, కిరణ్ అనే వ్యక్తికి రూ.50,000 ఇచ్చి సురేశ్ హత్యకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనెల 16వ తేదీ రాత్రి బర్త్‌డే పార్టీ కొండాపురంలో ఉందని సుభాన్ కిరణ్‌లు బొలేరో వాహనంలో సురే శ్‌ను ఎక్కించుకున్నారు. లావనూరు గ్రామం వద్ద ఉన్న నల్లవంక బ్రిడ్జి వద్దకు రాగానే సురేశ్‌కు ఎక్కువ మోతాదులో మద్యం తాగిం చారు. స్పృహ కోల్పోయిన తర్వాత నల్లని తాడుతో సురేశ్ గొంతు బిగిం చి హత్య చేసి మృతదేహాన్ని బ్రిడ్జిపై పడేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహం వద్ద తాగిన మద్యం బాటిళ్లు, నీళ్ల ప్యాకెట్లు గ్లాసులు ఉంచారు. దీంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటటేశ్వరరావు ఆదేశాల మేరకు కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, విద్యాసాగర్ గత మూడు రోజులుగా ఎల్లనూరు పోలీసుల సహకారంతో కేసును ఛేదిం చారు. గురువారం సాయింత్రం బాబు, సుభాన్, కిరణ్, వీర కుమా రి లను అరెస్టు చేసి.. బొలేరో వాహనం, పల్సర్‌బైకు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.. వీరిని ప్రొద్దుటూరు కోర్టులో హాజరు పరచగా కడప జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలపారు.

దుంపలగట్టులో భారీ చోరీ

● రెండిళ్లలో దొంగతనం ● బంగారు, నగదు అపహరణ


చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఖాజీపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నడు లేని విధంగా దుంపలగట్టు గ్రామంలో గురువారం రాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఇళ్లలోని వారు బయటకు రాకుండా గృహాలకు గడియ బిగించి దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామస్థుల కథనం మేరకు.. గురువారం రాత్రి 11 గంటల వరకు రామాలయం గుడిలో కొందరు గ్రామస్థులు భజనలు చేసి ఇళ్లకు వెళ్లారు. తర్వాత ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ మూడు గృహాలకు బయటకు రాకుండా గడియ బిగించి చోరీలకు పాల్పడ్డారు. తీరా ఉదయం చూస్తే దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ మోహన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిలో 148 గ్రాముల బంగారం, రూ.4.20 లక్షలు నగదు, ఇండ్ల సుధాకర్‌రెడ్డి గృహంలో 20 గ్రాముల బంగారం, రూ.20 వేలు నగదు అపహరణకు గురైందని తెలిపారు. వేలిముద్రలు సేకరించడంతోపాటు డ్వాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి దొంగలను పట్టుకునేందుకు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నామన్నారు. సీసీఎస్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి, క్లూస్‌టీం సీఐ రుక్మిణిదేవి, ఎఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు శిక్ష

బద్వేలు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అర్బన్ పోలీసు స్టేషన్‌పరిధిలో వెంకటరమణారెడ్డి అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన కేసులో నిందితుడు మీసాల వెంకటయ్య, మీసాల శ్రీనివాసులకు శనివారం అడిషినల్ సీనియర్ సివిల్‌జడ్జి 2సంవత్సరాల 6నెలల సాధారణ కారాగార శిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. బాధితుని తరుపున ఏపీపీ కె.రవిచంద్ర వాదనలు వినిపించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్షపడేలా కృషిచేసిన అర్బన్ సీఐ రాజగోపాల్, కోర్టు కానిస్టేబుల్ పి.నాగరాజులను ఉన్నతాధికారులు అభినందించినట్లు ఆయన తెలిపారు.

బలిజల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మేడ కళ్యాణమండపంలో ఈనెల 22న జరిగే బలిజల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రతి బలిజ కులస్థుడు తప్పకుండా హాజరుకావాలని కోరారు. శుక్రవారం కడపలోని హరిట వర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బలిజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహానేత ఎన్టీరామారావు హయాంలో బలిజలకు మూడు ఎమ్మెల్యే పదవులు ఒక ఎంపీ పదవి ఉండేదని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన పార్టీలు బలిజలకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. చంద్రబాబు రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్‌ను బలిజలకు కేటాయిస్తే కుట్రలు చేసి ఓడించారన్నారు. రాయలసీమలో బలిజ కులస్థులు ఎవరు కూడా క్రియాశీలక పదవులలో లేరన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యే మంత్రి నారాయణ, రామానాయుడు, దుర్గేష్‌లతో చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. బలిజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి అవన్నీ సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బలిజ ప్రతినిధులు నాగరాజు, ప్రసాద్, బాబు, కేవీ రావు, బాలకృష్ణ, రామచంద్రయ్య, మస్తాన్, వెంకట సుబ్బయ్య, సీఆర్‌సీ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కందిమల్లయపల్లె ఈశ్వరీదేవి మఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి వీరశివకుమారస్వామి తెలిపారు. 22న ఆదివారం ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం నైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగం, రాత్రి కలశోత్సవం, కలశ స్థాపన నిర్వహించడం జరుగుతుందన్నారు. 23న సోమవారం అశ్వవాహన ఉత్సవం, రాత్రి హంసవాహన ఉత్సవం ఉంటుందని తెలిపారు. 24న మంగళవారం ఈశ్వరీ దేవిమహాదేవి సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర సుదినం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు, శాంతి హోమాలు, రాత్రి సింహ వాహనంపై గ్రామోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ, ఊయల సేవ, సాయంత్రం తులాబారం కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 25న పుష్ప రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. 26న పూర్వ మఠాధిపతి వీరబ్రహ్మయ్యాచార్య స్వాముల వారి ఆరాధన నిర్వహిస్తారన్నారు. 27న మహాప్రసాద వినియోగం, దివ్య మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ భక్తులకు అందజేస్తామని తెలిపారు.

నేడు వైవీయూలో ఇండక్షన్ ప్రోగ్రామ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 21వ తేదీ ఉదయం 10గంటలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోస్ట్‌గ్రాడ్యు యేషన్ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, విశిష్ట అతి థులుగా కుల సచివులు ఆచార్య పి.పద్మ, గౌరవ అతిథులుగా రాజపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, చిన్మయమిషన్ అధ్యక్షుడు తురి యానందస్వామి, తైక్వాండో శిక్షణా నిపుణులు ఎం.నాగూర్‌బాబు హాజరవుతున్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులు సాగిస్తూ అనకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈకార్యక్రమం చేపడుతున్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలి


మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

పెండ్లిమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్ ఈనెల 27వ తేదీ పర్యటన సందర్భంగా ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెల్లటూరులో మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన, పంటల సాగు గురించి, మినుము, చామంతి, వేరుశనగ, మామిడి పంటలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఓబులేసు, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇండోర్ స్టేడియం అక్రమాలపై విచారణ

ప్రొద్దుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూలు గ్రౌండ్‌లోని ఇండోర్ స్టేడియం మెయింటనెన్స్‌కు సంబంధించి జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు ఆదేశించారు. ఆమేరకు తిరుపతి పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్యామ్ సుందర్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఇండోర్ షటిల్ స్టేడియంకు వచ్చే ఆదాయానికి ఖర్చులకు సంబంధించి గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్లు సంక్రాంతి వెంకటకృష్ణ ప్రమోద్ కుమార్‌లు నిబంధనలు పాటించకుండా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో ఈ స్టేడియంలో జరిగిన అవకతవకలపై విజిలెన్సు విచారణ నివేదిక సైతం మున్సిపల్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ నేపథ్యంలో తిరిగి మూడు నెలలలోపు ఈ విచారణ పూర్తి చేసి ఇందుకు బాధ్యులైన అధికారులపై చార్జ్‌ప్రేమ్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏపీజీఈఏ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రఘు రామనాయుడు, రాష్ట్ర కోశాధికారి డి.శ్రీహరి పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.ప్రసాద్‌గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ భాగ్యప్రసాద్, ఉపాధ్యక్షులు టి.సుమర్ జి, సి.నజీర్, జి.శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్.గిరిధర్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా ఎస్.జిగాని బాష, మహిళా విభాగం పి.భువనేశ్వరి, కోశాధికారి మహేశ్వరరెడ్డి, డీఈసీ మెంబర్స్‌గా బి.ప్రత్యూష ఎస్.విజయ, రాష్ట్ర ఈసీ మెంబర్‌గా ఎస్.మహబూబ్ రెహమాన్ ఎన్నికయ్యారు. రఘురామనాయుడు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకోసం కృషి చేయాలని నూతన నాయకత్వానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సురేంద్రనాథ్, జిల్లా మాజీ అధ్యక్షులు ఫణీంద్ర, పుల్లయ్య, అబ్దుల్ ఖాదర్, మహేష్, శ్రీహరి, రాజశేఖర్, వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య

● అనాథలైన కుటుంబసభ్యులు


ఆత్మహత్య చేసుకున్న మల్లేశం (ఫైల్), అనాథలైన కుటుంబ సభ్యులు

దువ్వూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేతికందని పంటలు... వెంటాడిన అప్పుల బాధలు... కుటుంబ కష్టాలు... వెరసి అన్నదాత ఆత్మహత్యకు దారితీశాయి. ఈ సంఘటన దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో జరిగింది. మల్లేశం (35)అనే రైతు తనకున్న అర్ధఎకరంతో పాటు నాలుగు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకున్నాడు. నాలుగేళ్లుగా వివిధ పంటల సాగుకు చేసి సక్రమంగా చేతికి రాకపోవడంతో ప్రతి ఏటా అప్పులపాలయ్యాడు. పంటల సాగుకు రూ.6లక్షలు దాకా అప్పులు చేశాడు. అసలే నిరుపేద కుటుంబం. మూడు సంవత్సరాల నుంచి 8 సంవత్సరాల వయస్సు కలిగిన నలుగురు ఆడపిల్లలు కలిగి ఉన్నారు. భార్య సుమలతతోపాటు తల్లి లక్ష్మీదేవి కూలిపనికి వెళుతున్నా కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో మల్లేశం ఉన్న కొద్ది బంగారం సైతం కుదువకుపెట్టి అప్పులు చేశాడు. ఈ పరస్థితుల్లో చేసిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యజమాని మరణంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి అనాథలా మారింది. ఈ సంఘటన గ్రామస్థులను కలచి వేసింది.

నారా భువనేశ్వరిని కలసిన కేకే చౌదరి

రైల్వేకోడూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని కుప్పం పర్యటన సందర్భంగా శుక్రవారం రైల్వేకోడూరు టీడీపీ నాయకుడు, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి ఆమెను కలిసి ఘనంగా సత్కరించారు. పలు రకాల సమస్యలను ఆమె దృష్టికి తీసుకుని వచ్చారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు చౌదరి తెలిపారు.

ఏపీ రైతు సంఘం మహాసభలను

జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 8న రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో జరిగే ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలకు అన్నమయ్య జిల్లాలోని రైతులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ మహాసభల్లో జిల్లా వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడంతో పాటు, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వేణుగోపాల్‌రెడ్డి, సలీం, హరి తదితర రైతులు పాల్గొన్నారు.

రెడ్డివారిపల్లె రోడ్డుకు మరమ్మతులు చేయండి

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లెకు వెళ్లే తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు చేయాలని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆయన ఇటీవల తెగిపోయిన తాత్కాలిక రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డివారిపల్లెకు వైసీపీ ప్రభుత్వంలో బ్రిడ్జిని మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. . ఇప్పటికైనా అధికారులు తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

వీరబల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టాలపై అవగాహన పొందడం ద్వారా మోసాల నుంచి బయటపడవచ్చని ఏపీసీఆర్‌ఎఫ్ సభ్యులు మేకల దర్బార్ తెలిపారు. శుక్రవారం మట్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు నెలల నిర్లక్ష్యం!

- ఓబనపల్లె దళితవాడలో పేరుకుపోతున్న చెత్త
- దుర్వాసన, దోమల విజృంభణతో గ్రామస్తుల ఆందోళన



దళితవాడ మార్గంలోని చెత్త కుప్ప

రైల్వేకోడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా చెత్తను తొలగించకపోవడంతో అది కుళ్లి కంపు కొడుతోందని, దీంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఓబనపల్లె దళితవాడవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. .ఓబనపల్లె పంచాయతీలోని దళితవాడలో 80 కుటుంబాలుండగా, 500 మంది ఓటర్లు, 700 జనాభా ఉంది. పంచాయతీకి ఒక ట్రాక్టర్ ఉంది. ఆరుగురు పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. అయినా, ఆరు నెలలుగా చెత్తను తొలగించకుండా కాలయాపన చేస్తున్నారని, అడిగితే తొలగిస్తామని చెబుతున్నారే తప్ప చర్యలు లేవని దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని చెబుతున్నారు. దళితవాడ దారిలోనే చెత్తచెదారం వేస్తుండడంతో రోజురోజుకు చెత్తకుప్పలు పెరిగిపోతున్నాయని దళితులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరు నెలలైంది



ఆరు నెలల నుంచి చెత్త తొలగించడం లేదు. పంచాయతీ కార్యదర్శికి చెబుతున్నా పట్టించుకోవడం లేదు. చెత్త రోజు రోజుకు పెరిగిపోతుండడంతో ప్రజలే ఎత్తివేయాల్సి వస్తోంది. పంచాయితీకి నిధులు ఉన్నా దళితవాడలో చెత్త చెదారం తొలగించడం లేదు.

- కనుపర్తి ఈశ్వరయ్య, మండల మాజీ ప్రెసిడెంట్

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం



చెత్తాచెదారం తొలగించే విషయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో దోమల కారణంగా నిద్రపోవడం ఇబ్బందిగా మారింది. చెత్త కుప్పలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. అధికారులు స్పందించాలి.

- కనుపర్తి ప్రహ్లాద, ఓబనపల్లె దళితవాడ

ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం తనిఖీ



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఈవో డాక్టర్ కే. సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పునాది స్థాయి అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం అనే అంశాలపై పట్టణ పరిధిలోని అర్చనా విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, ఎస్‌సీఈఆర్టీ స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ రోషిణి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. అనంతరం ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలతో పిల్లవాడి లెర్నింగ్ అవుట్‌కమ్స్ మెరుగుపర్చడంతో కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

'అసంబద్ధ విధానాలకు స్వస్తి పలకాలి'

పెనగలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖలో అధికారులు తీసుకుంటున్న ఏకపక్ష విధానాలతో ఉపాధ్యాయులు తీవ్ర వేదనకు గురవుతున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నల్లపురెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో విరామం సమయంలో ఆయన ఉపాధ్యాయులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి బుధవారం సిద్దయ్యశెట్టి అనే ఉపాధ్యాయుడు ప్రశ్న పత్రాలను తీసుకువస్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారన్నారు. గతంలో కరోనా సమయంలో ఉపాధ్యాయులు ఎందరో ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. కొత్తగా ఏర్పడిన నూతన ప్రభుత్వం కూడా తేలికగా చేయాల్సిన పనులను కూడా ప్రహసనంగా మారుస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అన్వర్‌బాషా, మహేంద్ర, సుదర్శన్, శివనరసింహులు, కృష్ణకుమారి, ప్రమీల, పరిమిళ, పద్మజ పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్ అండ్ బీ రోడ్డు సర్వే

పెనగలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలపై శుక్రవారం కూడా మండల సర్వేయర్ సుబ్రమణ్యం అధ్యక్షతన సర్వే చేశారు. అయితే, సర్వే తీరుపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో భవన నిర్మాణాలు జరిగేటప్పుడు సర్వే రాళ్లను తొలగించి ఆధారాలు లేకుండా చేశారని, ఆ రాళ్ల ఆధారంగా సర్వే చేయాలని సర్వే బృందాన్ని కోరుతున్నారు. మండల సర్వేయర్ ప్రజలతో మాట్లాడుతూ తాము బ్రిటిష కాలంలో రాసిన రికార్డుల ప్రకారం సర్వే చేస్తున్నామని ఇందులో ఏ మాత్రం తేడాలు ఉండవని తెలిపారు. ఈ సర్వేలో ఎవరి ఒత్తిడి లేదని తెలిపారు. ఈ సందర్భంగా కలిసిన విలేకరులతో మండల సర్వేయర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ సర్వే శనివారం కూడా జరుగుతుందని తెలిపారు.

ముంపు బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

నందలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చెయ్యేరు నుంచి కన్యక చెరువుకు నీటిని తరలించే ప్రధాన కాలువ లీకేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్న నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి పరిధిలోని ఆర్ అండ్ బి బంగ్లా వెనుకవైపు ఉన్న ప్రజలను ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం ఉదయం పరామర్శించారు. రాజంపేట సబ్‌కలెక్టర్‌కు వైఖోం నిధియా దేవికి ఫోన్లో సమస్యను వివరించి బాధితులకు న్యాయం చేయాలని కోరానన్నారు. దీంతో ఆమె స్థానిక తహసీల్దార్ అమర్‌నాథ్‌ను బాధిత కుటుంబాల వద్దకు పంపించారన్నారు. సమస్య పరిష్కరించాలని నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్యను ఆదేశించానన్నారు. రెండు రోజుల్లోగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు

ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు

నందలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై అలసత్వం వహించవద్దు అని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు అధికారులకు సూచించారు. శుక్రవారం నాడు మండలంలోని టీవీపురంలో రెవెన్యూ సదస్సులో హాజరై ప్రసంగించారు. ప్రతిఒక్కరు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అమర్‌నాథ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీవో సంఘం భవనం ప్రారంభం

రాజంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో నూతనగా ఏర్పాటు చేసిన ఎన్జీవో భవన సముదాయాన్ని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆర్ అండ్ బీ బంగ్లా నుంచి ఎన్జీవో హోం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుని, కార్యవర్గ సభ్యులను ఎన్జీవో సంఘ నాయకులు సన్మానించారు

ఆలిండియా ట్రెక్కింగ్‌కు చిట్వేలి ఎన్‌సీసీ విద్యార్థి

చిట్వేలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ విద్యార్థి పులి దిలీప్‌కుమార్ ఆలిండియా కేరళ ట్రెక్కింగ్‌కు ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఏబీఎన్ ప్రసాద్, ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జాతీయ స్థాయి శిబిరానికి ఎంపికవ్వడం పట్ల పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బెటాలియన్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



క్యాండిల్స్ పట్టుకుని వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నేతలు

సిద్దవటం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్ ఆవరణలో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఇన్‌చార్జి కమాండర్ డి.నాగేశ్వరప్ప, రాష్ట్ర టీడీపీ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ హాజరయ్యారు. పశువుల పాక వద్ద ఫాదర్ జాన్ లా లారెన్స్ ప్రార్థన చేసి కేకులు కట్ చేశారు. అనంతరం క్యాండిల్స్ పట్టుకొని క్రిస్మస్ వేడుకలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతిరాజ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య టీడీపీ నేతలు చెంచయ్యనాయుడు, రామ్మోహన్‌నాయుడు, రాజశేఖర్, కృష్ణ, సుబ్బారెడ్డి, పోలీస్ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్‌గా మస్తాన్‌బాషా

నందలూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్‌గా నందలూరుకు చెందిన. బద్వేల్ మస్తాన్‌బాషాను ఎంపిక చేశారు. ఈనెల 19, 20 తేదీల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించిన 54వ యాన్యువల్ జనరల్ కౌన్సిల్ సమావేశం లోకో పైలట్ మస్తాన్‌బాషాను గుంతకల్ డివిజనల్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేశారు. .

నేడు వాహనాల వేలం

ఓబులవారిపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పోలీసుశాఖ పరిధిలో పట్టుబడిన వాహనాలను శనివారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. 6 ద్విచక్ర వాహనాలు, 4 కార్లను స్క్రాప్ కింద వేలం వేస్తున్నామని ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

గిరిజన 'గురుకుల' ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

రాయచోటిటౌన్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు మూడే శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక సీపీఐ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో దాదాపు 15 ఏళ్లుగా ఐదు వేల రూపాయల నుంచి 12 వేల రూపాయల అతి తక్కువ జీతంతో పని చేస్తున్న 1653 మంది ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయకపోగా, వారి స్థానంలో డీఎస్సీ అభ్యర్థులను నియమించాలనుకోవడం బాధాకరమన్నారు. 30 రోజులుగా వారు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం చర్చలకు పిలువకుండా కాలయాపన చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

గిరిజన గురుకులంలో ఎంఈవో తనిఖీలు

సుండుపల్లె: శుక్రవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన కథనానికి మండల విద్యాశాఖ అధికారి మూడే వెంకటేశ్ నాయక్ స్పందించి గిరిజన గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలియజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు అస్తవ్యస్తంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సైక్‌లో వెళ్లిన ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రానికి విధుల్లోకి చేరాలని కోరారు. అలా చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రమోద్ పాఠశాలకు రావడం లేదని, సెలవు పెట్టలేదని ఆయన పనితీరుపైన జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ మహేశ్వరి రోడ్డు ప్రమాదంలో గాయపడి సెలవులో ఉన్నట్లు తెలియజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. వాట్సప్‌లో లీవ్ లెటర్ పెట్టి వెళ్లడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. హక్కుల కోసం పోరాటం చేసేటప్పుడు పై అధికారులకు వినతిపత్రాలు అందజేసి వెళ్లాలని, ఇష్ట ప్రకారం సమ్మె పేరుతో ఇండ్ల దగ్గర ఉంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విధులకు హాజరు కాకపోవడంపై వివరణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.



ఫిబ్రవరిలో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు

రాయచోటిటౌన్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): రానున్న ఫిబ్రవరి నెల 16, 17వ తేదీల్లో అన్నమయ్య జిల్లా పరిధిలోని రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రంలో ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా మొదటి మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా జనరల్ బాడీ సమావేశం లో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అటు దేశంలో ఇటు రాష్ట్రంలో సంపద సృష్టిస్తున్న కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తున్నారని, ఎన్నో త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకు న్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, వలసలు నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావడానికి అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎల్ నరసింహులు, కార్యదర్శి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠానికి పాదయాత్ర

రాజంపేట టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుంచి బ్రహ్మంగారి మఠం కమిటీ సభ్యులు శుక్రవారం పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్రలో వివిధ దేవతామూర్తుల వేషధారణలతో వాయిద్యాల నడుమ పాదయాత్రగా బయలుదేరారు. రాజంపేట పట్టణం బోయనపల్లె, నందలూరు, ఒంటిమిట్ట, బాకరాపేట, బద్వేల్ మీదుగా బ్రహ్మంగారిమఠం వరకు పాదయాత్ర కొనసాగుతుంది. అనంతరం బ్రహ్మంగారిమఠంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

సిద్దవటం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమకు అండగా ఉంటుందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలియజేశారు. మండలంలోని మాధవరం-1 బంగారుపేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గుండ్ల పెద్దసుబ్బరాయుడు నిర్మించిన మినీ గోకులాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పాడి రైతులందరికీ ఇలాంటి షెడ్లు నిర్మించుకునేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామంలో తాగునీరు, చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. కూటమి నేతలు ఆయనను గజమాలతో సత్కరించారు.

సిద్ధవటం: మండలంలోని టక్కోలి గ్రామ నివాసి నేలటూరి వెంకట ప్రవీణ్‌కు సుగవాసి రూ. 8 వేల సీఎం సహాయనిధి చెక్కును అందించారు.

భారతదేశ మూల సంస్కృతిని కాపాడుకుందాం

రాయచోటిటౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారతదేశ మూల సంస్కృతిని కాపాడుకుందామని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య పిలుపునిచ్చారు. భారతీయ అంబేద్కర్ సేన 13వ వార్షికోత్సవం సందర్భంగా రాయచోటి పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ మూలసంస్కృతిని పరిరక్షించడానికి ఆవిర్భవించిన విప్లవ వేదిక భారతీయ అంబేద్కర్ సేన(బాస్) అని అన్నారు. ఈ నెల 29న మదనపల్లె పట్టణంలో జరగబోయే భారీ సభను జయప్రదం చేయాలని కోరారు. అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు మూడే శంకర్‌నాయక్, భారతీయ అంబేడ్కర్ సేన నియోజకవర్గ నాయకులు రమేశ్‌బాబు, పామయ్య, సహదేవ, సుధాకర్, పవన్‌కుమార్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

రాయచోటి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంతో పాటు, విద్యార్థుల ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పసుపులేటి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, మాధవ్, ఉపాధ్యక్షుడు వినోద్, గర్ల్స్ కోకన్వీనర్ భవిత, రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి కార్తీక్‌నాయక్, తంబళ్లపల్లి నియోజకవర్గ కార్యదర్శి గణేశ్, రాయచోటి పట్టణ కార్యదర్శి లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చిట్వేలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాతచిట్వేలి ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలలకు హెల్త్‌కార్డులు ఇచ్చి ఆరోగ్యం, ఎత్తు, బరువులతో పాటు ఆరోగ్య పరీక్షలు చేసి రాష్ట్రీయ బాల ఆరోగ్యం కార్యక్రమంలో ఆన్‌లైన్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్‌బాషా, ఎంఎల్‌హెచ్‌పీ కల్పన,. ఏఎన్‌ఎం పద్మ, ఆశా కన్యాకుమారి పాల్గొన్నారు.

'అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి'

రైల్వేకోడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను కించపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని ఎస్‌ఎఫ్‌ఐ కోడూరు మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దీవీన్, లతీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైల్వేకోడూరులో విద్యార్థులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్ధ సేవకుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్‌ను తూలనాడడం దేశ ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్, వీరేంద్ర కుమార్, దీపిక, స్వరూప, నేహా, విద్యార్థులు పాల్గొన్నారు.

భజన కళాకారులకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో పని చేస్తున్న భజన కళాకారులకు రూ. 10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని టీటీడీ అన్నమయ్య కళాక్షేత్రం రంగస్థల కళాకారుడు తుమ్మల హరినాథ డిమాండ్ చేశారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో కళాకారుల ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ దేవాలయాల్లో భజన చేసే కళా కారులకు రూ. 10 వేలు గౌరవ వేతనం ఇచ్చేలా ఈ నెల 24న జరిగే పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో హార్మోనిస్టు బాబు, రాము, భజన గురువులు ఆదినారాయణ, రామానుజులు, భాస్కర, జలంధర్, లక్ష్మీదేవి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు

సామాజిక తనిఖీల్లో రూ1.15 లక్షలు రికవరీ



సామాజిక తనిఖీ గ్రామసభలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

చిన్నమండెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మాగాంధీ ఉపాధి కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ జరిగిన 19వ సామాజిక తనిఖీల్లో 1,15,276 రూపాయలు రికవరీ చేశారు. ఈ సందర్భంగా పీడీ వెంకటరత్నం మాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన 4625 మొక్కలన్నీ ఎండిపోయినా బిల్లులు పెట్టుకున్నారని టెక్నికల్ అసిస్టెంట్‌ను నిలదీశారు. రిజిస్టర్లు మెయింటైన్ చేయడం పోవడంపై సిబ్బందిని సంజాయిషీ కోరారు. కూలీల సంతకాలు లేకుండా బిల్లులు మార్చారని సామాజిక తనిఖీల్లో బయటపడడంతోఎఫ్‌ఏ, టీఏల నుంచి ఆ మొత్తాన్ని రికవరీకి ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1486 పనిదినాలకు, సామగ్రి ఖర్చు 4,21,96,602 రూపాయలు కాగా మొత్తం ఖర్చు 13,76,09,165 రూపాయలని ఏపీవో మాధవి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో మొత్తం 1,15,276 రూపాయలు రికవరీ చేయాలని పీడీ ఆదేశించగా, 8,255 రూపాయలు చెల్లించారు.

ఆలయ హుండీ దొంగల అరెస్టు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వర స్వామి ఆలయంలో డిసెంబరు 9న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు. రైల్వేకోడూరు సీఐ కే. హేమసుందరరావు, ఎస్‌ఐ నవీన్‌బాబు కథనం మేరకు స్థానిక బొమ్మవరం క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న కొమ్మలపాటి గోవర్ధన్ అలియాస్ గని, మల్లిబోయిన శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ఆలయంలో చోరీకి పాల్పడింది వారేనని తేలింది. వారి నుంచి రూ.66,132లు స్వాధీనం చేసుకుని నిందితులను రైల్వే కోడూరులో హాజరపరచినట్లు తెలిపారు. గోవర్ధన్‌పై నెల్లూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో 32 కేసులు ఉన్నాయని వివరించారు.

వంటగ్యాస్ సిలిండర్ల స్వాధీనం

రాజంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడు హోటళ్లలో అక్రమంగా వినియోగిస్తున్న 13 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గీతావాణి ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది స్వాధీనం చేసుకుని, యజమానులపై కేసులు నమోదు చేశారు. ఇంకా దాడులు కొనసాగుతున్నాయి. పాతబస్టాండులో ఓ హోటల్ నుంచి 4 రోడ్లు భవనాల అతిథిగృహం సమీపంలోని ఒక హోటల్ నుంచి 5, మరో హోటల్ నుంచి 4 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు వారు వివరించారు.

నేడు డయల్ యువర్ ఏపీఎస్ ఆర్టీసీ

రాయచోటిటౌన్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం డయల్ యువర్ ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యక్రమం ఉంటుందని రీజనల్ మేనేజర్ రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్టీసీ సమస్యలపై ప్రజలు నేరుగా 8985 283211 అనే నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

తప్పుడు పత్రాలతో కబ్జా చేశారు

● కలెక్టర్‌కు బాధితురాలి ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గాలివీడుకు చెందిన ప్రజలు

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోర్టులో కేసు నడుస్తున్నా తమ భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేసేందుకు యత్నిస్తున్నారంటూ ఓ వృద్ధురాలు శుక్రవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. గాలివీడు గ్రామానికి చెందిన హుస్సేన్‌సాబ్‌కు అదే గ్రామంలోని సర్వే నంబరు 475లోని భూమిపై 456/88 నంబరుతో ప్రభుత్వం డీకేటీ పట్టా జారీ చేసింది. ఆయన మరణానంతరం ఆయన భార్య షేక్ షంషాద్ (73) ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవించేది. 2022 అక్టోబరు 22వ తేదీ రాత్రి వేళలో షేక్ అహ్మద్‌బాషా, షేక్.జిలానీబాషా ఆ భూమిలోని పైరును దున్నేసి కబ్జా చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ఈ విషయంపై ఆర్‌వోఆర్ కోర్టులో కేసు కూడా నడుస్తోందని, అయినా, ఆ భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేసేందుకు తహసీల్దార్ చూస్తున్నాడని అర్జీలో పేర్కొన్నారు. ఈ విషయంపై కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన అనంతరం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

15 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● ఐదుగురు కూలీల అరెస్టు

రాజంపేటటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేట మండల పరిధిలోని అనంతసముద్రం సమీపంలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 15 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎన్.సుధాకర్ తెలిపారు. శుక్రవారం రాజంపేట పట్టణంలోని రూరల్ పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పీఎస్ రాజ్‌కుమార్, ఎస్బీవో పోలీసు సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించి రూ.5 లక్షల విలువైన దుంగలు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూరల్ సీఐ డీవీ రమణ, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు. అరెస్ట్ చేసినవారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు.

మంచు మాటున ప్రమాదం

● వేకువజామున ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం

● జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా గమ్యం చేరవచ్చు

బద్వేలు టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా చలికి జనం గజగజ వణుకుతున్నారు. చలి మాత్రమే కాదు.. విపరీతమైన పొగమంచు కమ్ముకుంటోంది. గతంలో తెల్లవారుజామున పొగమంచు వచ్చేది. ఇప్పుడు పగలంతా మంచు ఉంటోంది. ముఖ్యంగా తెల్లవారు జామున నాలుగుగంటల నుంచి ఉదయం 8గంటల వరకు దట్టమైన పొగమంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చలితీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. సాయంత్రం చీకటి పడకముందే చలి మొదలవుతోంది. ముఖ్యంగా వాహన చోదకులు చలితో ఇబ్బందులు పడుతున్నారు.

అసలే రహదారులు అంతంత మాత్రంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణరోడ్లు, పల్లె కూడళ్ల వద్ద మలుపులు, ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించే పరిస్థితి లేకపోవడంతో ఇలాంటిచోట్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల కొన్ని రహదారుల్లో ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. అయితే వాహనచోదకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో పొగమంచులో ప్రయాణాలు చేసే వారికి పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు.

మంచుతో ప్రమాదం

- దట్టంగా మంచు కమ్ముకోవడం వలన వాహనదారులు రహదారిని అంచనా వేయలేరు. దారి సరిగా కనిపించదు.
- మంచు కారణంగా రోడ్డు చెమ్మగా ఉండటంతో వాహనాలు వేగంగా నడిపే క్రమంలో అదుపుతప్పే అవకాశం ఉంది.
- కొందరు ప్రధాన రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తుంటారు. అదే మార్గంలో వచ్చే వాహనచోదకులు పొగమంచు కారణంగా వాటిని గుర్తించలేక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.
- దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లకు సరైన విశ్రాంతి, నిద్రలేక వేకువజామున చల్లగాలులకు కునుకుపడుతోంది. దీనికి తోడు పొగమంచు కారణంగా ఎదురుగా వాహనాలు సమీపంలోకి వచ్చేవరకు గుర్తించలేకున్నారు. దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- కొందరు తెల్లవారుజామునే లేచి రహదారుల్లో జాగింగ్, వాకింగ్ చేస్తున్నారు. పొగమంచు కారణంగా వీరిని వాహనచోదకులు గుర్తించే అవకాశం లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.



రహదారుల్లో కమ్ముకున్న పొగమంచు

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్రస్తుత సీజన్‌లో పొగమంచు కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికం. ఈ క్రమంలో రహదారుల్లో నిత్యం వాహన చోదకులకు భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులకు స్టిక్కర్లు వేయిస్తున్నాం. వాహన తనిఖీల్లో భాగంగా మంచువల్ల ఎదురయ్యే సమస్యలను వివరిస్తున్నాం. ముఖ్యంగా ఆటోలు, వ్యాన్లు, ద్విచక్రవాహనాలు నడిపేవారు పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు. మితిమీరిన వేగం అనర్థదాయకం. సీటు బెల్టు, హెల్మెట్ వాడకం శ్రేయస్కరం.

- రాజగోపాల్ యాదవ్, సీఐ, బద్వేలు

పాటించాల్సిన జాగ్రత్తలు

- మంచుతీవ్రత అధికంగా ఉంటే ఆ ప్రభావం తగ్గే వరకు ప్రయాణం వాయిదా వేసుకోవాలి. ప్రయాణ సమయంలో మంచుతీవ్రత అధికమై రహదారి కన్పించకుంటే సురక్షిత ప్రాంతంలో వాహనాలు నిలుపుదల చేయాలి.
- మంచు కురిసే సమయంలో వాహనాలు నెమ్మదిగా నడపాలి. ఎదురుగా వచ్చే వాహన చోదకులు గుర్తించేలా వాహన హెడ్‌లైట్ ఆన్ ఆఫ్ చేయడం లేదా ఆఫ్ చేయడం శ్రేయస్కరం.
- ప్రయాణ సమయంలో బ్రేక్, సైడ్ ఇండికేటర్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖ్యంగా రోడ్ల మలుపుల వద్ద కుడి ఎడమలు స్పష్టం చేసే సిగ్నల్ లైట్స్ ఎదుటి వాహనదారులను అప్రమత్తం చేస్తాయి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్.. కారు, వ్యాను చోదకులు సీటు బెల్టు పెట్టుకోవాలి.
- వేకువజామున నిత్యం ప్రయాణించే కూరగాయలు, పాలు, వాటర్ ట్యాంకులు, పత్రికల వాహనాలు కచ్చితంగా వాహనం ముందు, వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు అతికించాలి.

మేకల మందపై చిరుతపులి దాడి

● ఒక మేక మృతి

● కనిపించని ఐదు జీవాల జాడ

● కుక్కల సాయంతో ప్రాణాలతో బయటపడ్డ కాపరి

● కనుగొండ సమీప గ్రామాల్లో తీవ్ర భయాందోళన

ములకలచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం సమీపంలో గల కనుగొండ రిజర్వు అటవీ ప్రాంతంలో మేకల గుంపుపై చిరుత పులి దాడి చేసింది. దీంతో ఒక మేక మృతి చెందగా.. మరొకటి తీవ్రంగా గాయపడింది. ఐదు మేకల జాడ కన్పించలేదు. కాగా మేకల కాపరిపై కూడా చిరుత పులి దాడి చేసేందుకు ప్రయత్నించగా.. తోడుగా ఉన్న కుక్కల సహాయంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనతో అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గ్రామాల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే...

పెద్దపాళ్యంలోని బీసీ కాలనీకి చెందిన పాళ్యం నరసింహులు మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి 120 మేకలు ఉన్నాయి. ప్రతి రోజు గ్రామానికి సమీపంలో ఉన్న కనుగొండ అటవీ ప్రాంతంలోకి మేత కోసం మేకలను తీసుకెళ్తుంటాడు. రోజులాగే గురువారం మేత కోసం కనుగొండ అటవీప్రాంతంలోని పెద్దజారుబండ పడమటి వైపున తోలుకెళ్లాడు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో మేకల మందపై చిరుత పులి ఒక్కసారిగా దాడి చేసింది. వరుసగా ఐదు మేకలను అడివిలోకి లాక్కెళ్లింది. మరో మేకను గొంతు దగ్గర కరిచి చంపగా.. మరో మేక గొంతును నోటితో పట్టుకోగా కాపరి నరసింహులు తీవ్ర భయాందోళనకు గురై వణికిపోయాడు. చిరుతపులి కాపరిపై కూడా దాడి చేసేందుకు యత్నించింది. కాపరి వెంట ఉన్న రెండు కుక్కలు గట్టిగా అరవడంతో పాటు నరసింహులు గట్టిగా అరవడంతో చిరుతపులి అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయాన్ని కాపరి కుటుంబీకులకు తెలియజేయడంతో అతని కుమారుడు అశోక్, మరికొందరు సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లారు. తీవ్రంగా గాయపడ్డ మేకను, చనిపోయిన మేకను గ్రామంలోకి తీసుకొచ్చారు. గాయపడ్డ మేక గొంతు వద్ద చికిత్సలు చేయించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి కాపరిని విచారించి వెళ్లిపోయారు. కనీసం ఘటన జరిగిన ప్రాంతాన్ని కూడా పరిశీలించలేదని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. కాగా కుక్కలు లేకుంటే తన



రోదిస్తున్న మేకల కాపరి నరసింహులు

ప్రాణాలు కూడా పోయేవని, కుక్కలు గట్టిగా మొరగడంతో చిరుత పులి వెళ్లిపోయిందని గొర్రెల కాపరి నరసింహులు రోదించాడు. ఈ ఘటనతో కాపరులు శుక్రవారం అడివిలోకి గొర్రెలు, మేకలు తీసుకెళ్లేందుకు భయపడి గ్రామ సమీపంలోనే మేపారు. రక్తం రుచి చేసిన చిరుతపులి సమీప గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని గ్రామస్తులకు అవగాహన కల్పించి భయం పోగొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!

● ఎట్టకేలకు ప్రారంభమైన పెద్దేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

● రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు

● రెండేళ్ల తరువాత పనులు తిరిగి ప్రారంభం

ములకలచెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాళ్యం వద్ద ముంబై - చెన్నై జాతీయ రహదారిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణ పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నత్తకు నడక నేర్పేలా జరిగిన పనుల్లో కదలిక వచ్చింది. రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు చేశారు. దేశంలోనే అతి పొడవైన జాతీయ రహదారి(ఎన్‌హెచ్-42) కావడంతో ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో తరచూ రైల్వే గేటు పడుతుండడంతో వాహనాలు బారులు తీరి నిలిచిపోతున్నాయి. తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేవి. జాతీయ రహదారిలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని సమయం ఆదా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్దపాళ్యం రైల్వేగేటుపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.49కోట్లు మంజూరు చేసింది. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వాహనాలు రైల్వే గేటు నుంచి కాకుండా బ్రిడ్జిపై వెళ్తాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేయడంతో 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దపాళ్యం ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. ఏడాదిన్నర పాటు పనులు జరగడంతో బ్రిడ్జి నిర్మాణం పనులు చివరి దశకు చేరాయి. ఇరువైపులా రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే రైల్వేగేటుపై వెళ్తున్న బ్రిడ్జిపై కొంత భాగం పనులు నిలిచిపోయాయి. ఇక్కడ దిమ్మెలు ఏర్పాటు చేస్తే పనులు ముగుస్తాయన్న సమయంలో రెండేళ్ల పాటు నిలిపేశారు. దీంతో బ్రిడ్జి నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రైల్వేగేటుపై బూస్టింగ్ గిర్డర్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒక బూస్టింగ్ గిర్డర్‌ను భారీ యంత్రాల సహాయంతో రైల్వేగేటుపై ఏర్పాటు చేశారు. ఈ పనులను ఎన్‌హెచ్ ఏఈ మధుసూదన్, రైల్వే శాఖ పీడబ్ల్యుఐ శ్రీనివాసులురెడ్డి, టీఆర్‌డీ జగదీశ్వరన్ పర్యవేక్షించారు. అయితే మరో బూస్టింగ్ గిర్డర్‌ను తయారు చేయాల్సి ఉందని, ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని, ప్రస్తుతానికి ఇప్పుడు ఏర్పాటు చేసిన బూస్టింగ్ గిర్డర్‌కు తుది పనులు పూర్తి చేసి ఫ్లై ఓవర్‌పై రాకపోకలు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.



పెద్దపాళ్యం రైల్వేగేటుపై ఏర్పాటు చేసిన బూస్టింగ్ గిర్డర్

రాజంపేట చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు

రాజంపేటటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణానికి చెందిన 18 నెలల బుడతడు షేక్ మహ్మద్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో (వరల్డ్ కింగ్స్) చోటు దక్కించుకున్నాడు. ఈ ఏడాది నవంబరు 30న ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో అర్హత సాధించగా డిసెంబరు 19న ప్రశంసా పత్రాన్ని, మెడల్స్‌ను కొరియర్ ద్వారా మహమ్మద్ తల్లిదండ్రులకు పంపించారు. ఓబులవారిపల్లె మండలంలో వీఆర్వోగా పనిచేసే షేక్ ముజీబ్ రాజంపేట పట్టణం ఈడిగపాలెంలో నివాసం ఉంటున్నాడు. షేక్ ముజీబ్, మసూదా బేగం దంపతులకు షేక్ మహమ్మద్ అనే 18 నెలల కుమారుడు ఉన్నాడు. ఈ చిన్నారి ఏడాది వయసు నుంచే పలు రకాల జంతువులు, కూరగాయలు, పండ్లు, స్వాతంత్ర్య సమరయోధులు, వాహనాలు, శరీరావయవాలు పలువురు సినిమా హీరో, హీరోయిన్లు, 19 రకాల ఆట వస్తువులు, వివిధ ఆకృతులు, వాహనాల విడిభాగాలు తదితరాలను టక్కున గుర్తించి చెప్పేస్తున్నాడు. ఈ విషయాలన్నింటిని వారి తల్లిదండ్రులు వీడియో రికార్డు చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు (వరల్డ్ కింగ్స్) వారికి సమాచారం అందించారు. ఆ సంస్థ ప్రతినిధులు ఈ వీడియో రికార్డులను పరిశీలించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ముజీబ్‌కు ప్రశంసాపత్రం, మెడల్స్‌ను పంపుతూ, వరల్డ్ కింగ్స్ టాప్ రికార్డ్సు జాబితాలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో అత్యంత తెలివైన వాడిగా చిన్నారిని గుర్తించారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తమ కుమారుడు షేక్ మహ్మద్ ఏడాది వయసు నుంచే ఏదైనా టక్కున గుర్తించి తెలియజేస్తాడని తెలిపారు. ఈ విధంగా ఏ ఆకృతిని చూపినా వెంటనే పేరు చెబుతాడన్నారు. కొందరి సలహా మేరకు తాము అన్ని విషయాలను వీడియో రికార్డింగ్ చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులకు పంపడంతో వారు ఈ ప్రశంసాపత్రాన్ని, మెడల్స్ పంపుతూ రికార్డులో నమోదు చేయడం తమకు ఆనందదాయకమన్నారు.



వివిధ ఆకృతులను గుర్తిస్తున్న చిన్నారి మహ్మద్

'అయ్యప్ప ఆలయాన్ని స్వాధీనం చేసుకోండి'

మదనపల్లె/కలికిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ మదనపల్లె గ్రూప్ టెంపుల్ ఈవోను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జీవో నెంబరు. 294 ఉత్తర్వులు జారీచేశారు. స్థానిక శివనగర్‌లో అయ్యప్ప స్వామి ఆలయం ఉంది. గతంలో దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయాన్ని ఆలయ అభివృద్ధి పేరుతో ఏర్పాటైన కమిటీ వినతి మేరకు 2022 సెప్టెంబరులో అప్పటి ప్రభుత్వం ఐదేళ్ల పాటు అభివృద్ధి నిర్వహణ కోసం అప్పగించింది. అయితే ఈ కమిటీపై తరచూ అటు అధికారులు, ప్రభుత్వానికి భక్తుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. ముఖ్యంగా ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదికలో ఫిర్యాదులు వస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రజల నుంచి భక్తుల నుంచి చందాలు వసూలు చేస్తున్నారని వాటికి సరైన లెక్కలు, రికార్డుల నిర్వహణ లేదని ప్రధాన అభియోగం. అలాగే ఆలయ కమిటీలో ప్రభుత్వం అనుమతి లేకుండా సభ్యులను మార్చేశారని తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటున్నారని వెల్లడైంది. ఈ పరిణామాలన్నింటిని పరిశీలించిన దేవదాయశాఖ ఆలయంపైన ప్రభుత్వం పైన చెడ్డపేరు వస్తుందని ఈ నిర్ణయం తీసుకుంది.

రోడ్డు పనికిపోతే దాడి చేశారు

సంబేపల్లె, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం కూలి పనులకు వెళితే తమపై దాడి చేయడంతో పాటు, చికిత్స పొందుతున్న తమపైనే కేసు కూడా పెట్టారని కొత్త వడ్డెపల్లెకు చెందిన జ్యోతి, మోహన్, హరీశ్, పుష్పాంజలి, రామాంజులు, అచ్చన్న ఆవేదన వ్యక్తం చేస్తుండగా, కౌంటర్ కేసు కోసమే వారు ఆస్పత్రిలో చేరారని సీఐ వివరిస్తున్నారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని నారాయణరెడ్డి గ్రామం పాలెంవాండ్లపల్లె నుంచి కొత్త వడ్డెపల్లె వరకు బీటీ రోడ్డు పనులు చేస్తున్నారు. శుక్రవారం పాలెంవాండ్లపల్లెకు చెందిన చంద్రయ్య ఈ రోడ్డు పనులు జరగకుండా అడ్డుకోవడంతో కొత్తవడ్డెపల్లె గ్రామస్తులు అతనితో ఘర్షణపడ్డారు. ఈ సందర్భంగా కూలి పనులకు వెళ్లిన తమపై చంద్రయ్య, సురేశ్, లక్ష్మీదేవి, బాలాజీ, సుమతి, అనిత తమపై దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో మోహన్ కాలు ఫ్రాక్చర్ అయిందన్నారు. దాంతో తాము ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటుండగా, తమపైనే కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఎస్ఐ భక్తవత్సలం వివరణ కోరగా... కొత్తవడ్డెపల్లె గ్రామస్తులు చంద్రయ్యకు చెందిన కంచె తొలగించడంతో పాటు దాడికి పాల్పడ్డారని, కౌంటర్ కేసు కోసమే వారు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు వివరించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి, మోహన్, హరీష్, పుష్పాంజలి, రామాంజులు, అచ్చన్న

ఆక్రమణదారులపై ఉక్కుపాదం



యంత్రాలతో అక్రమ నిర్మాణాలను తొలగిస్తుండగా గుమికూడిన జనం

● ఆర్‌అండ్‌బీ స్థలంలో రేకుల షెడ్లు తొలగింపు

● అక్రమ నిర్మాణాలు నేలమట్టం

● దూకుడు పెంచిన రెవెన్యూ, పోలీసు అధికారులు

గాలివీడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను, నిర్మాణాలను నేలమట్టం చేసి అధికారులు దూకుడు పెంచారు. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి ఉక్కుపాదం మోపుతూ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే...

గాలివీడు పట్టణంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో సర్వే నెంబరు 2266లో ఉన్న 1.80 ఎకరాల భూమిలో ఆక్రమణలు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే తరుణంలో స్థానికుల ఫిర్యాదు మేరకు కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు కదిలిన స్థానిక రెవెన్యూ యంత్రాంగం, ఆర్‌అండ్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు 11 మంది ఆక్రమణదారులకు తాఖీదులు అందజేశారు. 15 రోజులు గడువు ఇచ్చిన అనంతరం సిక్స్ నోటీస్ ఇచ్చిన అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను జేసీబీ యంత్రాలతో తొలగించారు. అయితే స్థానికులు కొందరు తమ నిర్మాణాలు తొలగించాలంటే ఎదురుగా ఉన్న మరికొన్ని అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఎదురుతిరిగారు. దీంతో తహసీల్దార్ భాగ్యలత, ఎస్ఐ రామక్రిష్ణ సమన్వయంతో చాకచక్యంగా వ్యవహరించి ఆక్రమణలను తొలగించారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన రెవెన్యూ, పోలీసు అధికారుల తీరును ప్రజలు అభినందిస్తున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తత

గత 30 సంవత్సరాలుగా ఆర్‌అండ్‌బీ స్థలంలో రేకుల షెడ్లు నిర్మించుకుని వ్యాపారాలు, నివాసాలు ఉన్న వారికి రేకుల షెడ్లు తొలగించాలని గత రెండు నెలలుగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిని ఖాతరు చేయకపోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో అక్రణ నిర్మాణాలను తొలగించడానికి ఎక్సకవేటర్లతో ప్రయత్నం చేయగా అక్రమ నిర్మాణదారులు తమ నివాసాలను తొలగించవద్దంటూ అడ్డుకున్నారు. స్థానికుడు ఒకరు రేకుల షెడ్లపైకి ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానంటూ హల్‌చల్ చేశాడు. ఎట్టకేలకు అక్రమ నిర్మాణాలు తొలగించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కానిస్టేబుల్ బెదిరించాడని.. విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న విద్యార్థి

రాయచోటిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ బెదిరించడంతో ఓ విద్యార్థి మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్న కథనం సోషల్ మీడియాలో శుక్రవారం హల్‌చల్ చేస్తోంది. రాయచోటి మండలం మాధవరం గ్రామం కంచరపల్లి కాలనీకి చెందిన కాల్వపల్లి రామాంజనేయులు శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, అతని తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం కువైత్‌లో ఉన్నారు. గురువారం రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ ధర్మా కంచరపల్లెకు వచ్చి రామాంజనేయులను ఇంటి నుంచి బయటకు లాగి, ఓ అమ్మాయి నుంచి బంగారం తీసుకున్నావని ఆరోపించడంతో పాటు, నానా దుర్భాషలాడినట్లు బంధువులు తెలిపారు. తనకు ఏమీ తెలియదని చెబుతున్నా వినకుండా కొట్టడంతో మనస్తాపానికి గురై ఇంట్లోకి వెళ్లి గుళికల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. వెంటనే అతన్ని రాయచోటిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి పరిస్థితి సీరియస్‌గా ఉందని పెద్దాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో, వెంటనే తిరుపతిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఆ విషయం తనకు తెలియదని, ఎటువంటి ఫిర్యాదు అందలేదని సమాధానమిచ్చారు.

జిల్లాలో 31 వేల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం

కలికిరి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జిల్లాలో 30950 ఎకరాలకు సూక్ష్మ సాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిణి వై.లక్ష్మీ ప్రసన్న తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అమర్చడానికి 30 కంపెనీలను గుర్తించామని, ముందుకొచ్చిన రైతులందరికీ సబ్సిడీపై వెంటనే పరికరాలు అమర్చేందుకు కంపెనీలు కూడా సిద్ధంగా వున్నాయని ఆమె చెప్పారు. వాయల్పాడు, కలికిరి, కలకడ, పీలేరు, కేవీ పల్లె మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల వ్యవసాయ, పశుసంవర్థక సహాయకులతో కలికిరి కేవీకేలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎంఐఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ 5 ఎకరాల్లోగా విస్తీర్ణం కలిగిన రైతులకు 90 శాతం, పది ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అమర్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రిప్‌తో సాగు చేసిన పంటల నుంచి తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయాన్ని రాబట్టవచ్చని వివరించారు. మొత్తం 30 కంపెనీల్లో రైతులకు నచ్చిన కంపెనీ నుంచి పరికరాలు అమర్చే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన రైతులు స్థానిక రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. నమోదైన రైతుల పొలాల్లో వెంటనే సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతు నమోదు చేసుకున్నప్పటి నుంచి పరికరాలు అమర్చడం పూర్తయ్యే వరకూ వివిధ దశల్లో చేయాల్సిన పనులకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మదనపల్లె, పీలేరు ఉద్యాన అధికారులు ఈశ్వరప్రసాద్, సుకుమార్‌రెడ్డి, ఎంఐడీసీ హరినారాయణ, ఎంపీఏవో దుర్గయ్య, ఉమాదేవి, వివిధ డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చు... అధిక దిగుబడులు

డ్రమ్‌సీడర్‌తో వరి సాగు.. రైతులకు లాభదాయకం



డ్రమ్ సీడరు విధానంతో వరిని ఎలా నాటాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వల్లూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో వర్షాలు సకాలంలో కురవక నార్లు పోయడం, నాట్లు వేయడం ఆలస్యం కావడంతో వరి దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా నారును నెలరోజులు పెంచి నారు తొలగించి నాటు వేయడానికి అధిక ఖర్చు కావడమే కాక నీటి వాడకం కూడా అధికమవుతుంది. ఈ నేపథ్యంలో రైతులు డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

డ్రమ్ సీడర్‌తో సాగు - ఉపయోగాలు

డ్రమ్‌సీడర్ పద్ధతిలో నార్లు పెంచి నాటు వేయాల్సిన అవసరం లేదు. దీంతో నాటుకు అవసరమైన కూలీల ఖర్చును ఆదా చేయవచ్చు విత్తన మోతాదును సగానికి సగం తగ్గించవచ్చు. డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తినప్పుడు ఒక చదరపు మీటరుకు ఉండాల్సిన మొక్కల సంఖ్య ఖచ్చితంగా ఉండడంతో వరి దిగుబడులు నాటు వేసిన వాటికంటే అధికంగా ఉంటాయి. వర్షాలు ఆలస్యమై నీరు సకాలంలో అందనప్పుడు కాల్వల ద్వారా నీటి విడుదల ఆలస్యమైనప్పుడు ముదురు నార్లతో నాట్లు వేస్తారు. దీని వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. అలాంటి పరిస్థితుల్లో డ్రమ్ సీడరు పద్ధతి అనువుగా ఉంటుంది. సాళ్ల మధ్యలో యంత్రాలతో అంతరకృషికి వీలుంటుంది. నాటు వేసిన వరి కన్నా 5 - 7 రోజులు ముందుగా డ్రమ్ సీడరుతో వేసిన వరి కోతకు వస్తుంది.

నేల తయారీ...

డ్రమ్ సీడరుతో వరి నాటే సమయంలో సాధారణ పద్ధతిలో కంటే వీలైనంత బాగా చదును చేసుకోవాలి. ఎత్తు పల్లాలు లేకుండా సమాంతరంగా ఉండడం చాలా అవసరం. పొలంలో నీరు నిల్వ ఉండకూడదు కాబట్టి నీరు ఎక్కువైతే బయటికి పోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలి. పెద్దగా ఉన్న పొలాలను చిన్న మడులుగా విభజించుకుంటే చదును చేయడానికి, నీరు పెట్టడానికి, విత్తనం చల్లడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. విత్తే సమయానికి నీరు లేకుండా బురద ఉంటే చాలు. ఇసుక శాతం ఎక్కువగా ఉన్న నేలలో విత్తాలనుకున్న రోజే ఆఖరి దమ్ము చేసి చదను చేసి పలుచటి నీటి పొర ఉండేట్లు చూసుకోవాలి. బంక నేలల్లో ఆఖరి దమ్ము చేసి చదను చేసిన మరుసటిరోజు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు

రకాన్ని బట్టి ఎకరాకు 10 - 15 కిలోలు అవసరమవుతాయి. కాండం గట్టిగా ఉండి వేరు వ్యవస్థ దృఢంగా ఉండి పడిపోని రకాలు మిక్కిలి అనుకూలం. ఆయా ప్రాంతానికి అనువైన, రైతుకు ఇష్టమైన ఏ రకమైనా ఈ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు.

విత్తన శుద్ధి

డ్రమ్‌సీడరు ద్వారా విత్తుకునేటప్పుడు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజయ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 12 గంటలు నానబెట్టి 24గంటలు మండెకట్టి కొద్దిగా ముక్కు పగిలిన గింజలను వాడకోవాలి.

విత్తే విధానం ఇలా..

డ్రమ్ సీడరు డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. గింజలు రాలడానికి వీలుగా ప్రతి డ్రమ్‌లో కేవలం 3/4 వంతు మాత్రమే మొలకెత్తిన గింజలను నింపాలి. గింజలు నింపిన డ్రమ్ సీడరు లాగితే 8 వరుసల్లో వరుసకు వరుసకు మధ్య 20 సెం.మీ దూరంలో గింజలు పడతాయి. వరుసల్లో కుదురుకు కుదురుకు మధ్య దూరం 5 - 9 సెంమీ ఉంటుంది. ఒక్కో కుదురులో 5 -8 గింజలు పడడం జరుగుతుంది. కొన్ని అనివార్యకారణాలతో కుదురులోని గింజలు 50 శాతం దెబ్బతిన్నా మిగిలిన 50శాతం గింజల నుంచి వచ్చిన మొక్కల సాంద్రత సరిపోతుంది. రకాన్ని బట్టి గింజలు పడడాన్ని బట్టి రంధ్రాలను స్టాపర్స్‌తో మూసుకోవాలి. సన్న గింజ రకాలకు రంధ్రం వదిలి రంధ్రం మూసివేయాలి. 16 వరుసలకు అడుగు వెడల్పు కాలిబాట ఉంచుకోవాలి. తాడు ఉప యోగించి డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి. ఆయా ప్రాంతాలకు మరియు రకాలకు సిఫార్సు చేసిన ఎరువులనే డ్రమ్ సీడరు పద్ధతిలో సాగు చేసిన వరికి వాడుకోవాలి.

నీటి యాజమాన్యం

విత్తిన తరువాత మొదట్లో నీరు లేకుండా బురదగా మాత్రమే ఉండి డ్రమ్ సీడరుతో సాగు - అవరోధాలు డ్రమ్‌సీడరు పద్ధతి చౌడు నేలలకు, నీట ముంపునకు గురయ్యే ప్రాంతాలకు అనువు కాదు.

పంట బాగా చేతికి వస్తుంది



డ్రమ్ సీడరు విధానంతో వరి పంట సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ విధానంతో రైతులకు కూలీల ఖర్చు, నీటి వాడకం తగ్గుతుంది. పంట కూడా బాగా చేతికి అందుతుంది.

- సాయిజ్యోతి,మండల వ్యవసాయాధికారి

పశువుల వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

● పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు శారదమ్మ

కడప రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా పశువులకు వచ్చే వ్యాధులను నియంత్రించడానికి పశుసంవర్ధకశాఖ సమర్థవంతమైన చర్యలు చేపడుతోందని పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. 2024-25 ఆర్థిక నాల్గవ త్రైమాసికంలో చేపట్టాల్సిన వైద్యసేవలు, టీకాల కార్యక్రమాలు ఇతర వైద్యసేవల గురించి క్షేత్రస్థాయి సిబ్బందికి ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అంతేకాకుండా జిల్లాలోని అన్ని పశువైద్యశాలలకు రూ.13కోట్ల విలువ కలిగిన మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పశువుల మందులు, టీకాల వినియోగంలో పారదర్శకత ఉండాలని వినియోగ వివరాలను ఖచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలి

కడప రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలని కడప జిల్లా పోర్ట్ పోలియో(హైకోర్టు) జడ్జి రామకృష్ణ ప్రసాద్‌ను కోరినట్లు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు తెలిపారు. ఈ మేరకు కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, సభ్యులు జయరామిరెడ్డి, చిన్నయ్య తదితరులతో శుక్రవారం అమరావతిలోని హైకోర్టులో జడ్జి రామకృష్ణ ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న ఈగిల్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విషయమై జడ్జి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని చెప్పారన్నారు. అనంతరం హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కవలడానికి ప్రయత్నించగా వీలుపడలేదని.. చాంబర్‌లో రెప్రజెంటేషన్ ఇచ్చామన్నారు.

జేఎన్టీయూలో ఆశ్రయ్ 2కె24-25 ప్రారంభం

పులివెందుల రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూలో ఆశ్రయ్ 2కె24-25ను శుక్రవారం సివిల్ విభాగంలో ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్దన్, గౌరవ అతిథి కళాశా ల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శేషమహేశ్వరమ్మ విజ్ఞానం, సాంకేతికను ఎలా పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 3డిమ్యాక్స్- ఆటోక్యాడ్‌పై విద్యార్థులకు రెడు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ముందుగా భారతర త్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సివిల్ విభాగాధిపతి ప్రొఫెసర్ సూర్యనారాయణరెడ్డి, పేపర్ ప్రజెంటేషన్ అతిథి గా ఎస్‌వీవీ.ప్రసాద్, ఏఐటీఎస్ రాజంపేట, సదస్సు ఇన్‌చార్జ్ మురళీమోహన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతో భర్తను హత్యచేయించిన భార్య

● భార్య, ప్రియుడితో సహా నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రఫీ, ఎస్సై విద్యాసాగర్

కొండాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా యల్లనూరు గ్రామానికి చెందిన సురేశ్ (36) ఈ నెల 17న మండలంలోని లావనూరు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు హత్యగా నిర్ధారించారు. వివాహేతర సంబంధం కారణంగా అతని భార్య, ప్రియుడు కలిసి హత్య చేయించారని పోలీసులు వెల్లడించారు. శుక్రవారం కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ విద్యాసాగర్‌లు వివరాలు వెల్లడించారు. యల్లనూరు గ్రామానికి చెందిన చిన్నగుల్లోబన్నగారి సురేశ్ భార్య వీరకుమారికి కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన గజ్జప్పగారి బాబుతో వివాహేతర సంబంధం ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరూ కలిసి ఊరు వదిలి వెళ్లిపో యారు. ఆమె తిరిగి భర్త వద్దకు వచ్చినప్పటి నుంచి ఇద్దరికి గొడ వలు జరిగేవి. ఆ తర్వాత ఆమె పుట్టింటికి వెళ్లి ఉంటోంది. ఈ నేప థ్యంలో వీరకుమారి, బాబు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. సురేశ్ ఉంటే తమకు అడ్డువస్తాడని సురేశ్ హత్యకు పన్నాగం పన్నారు. ఈ నేపథ్యంలో బాబు స్నేహితుడు వెలిదండ్ల సుభాన్‌కు రూ.1,00,000, కిరణ్ అనే వ్యక్తికి రూ.50,000 ఇచ్చి సురేశ్ హత్యకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈనెల 16వ తేదీ రాత్రి బర్త్‌డే పార్టీ కొండాపురంలో ఉందని సుభాన్ కిరణ్‌లు బొలేరో వాహనంలో సురే శ్‌ను ఎక్కించుకున్నారు. లావనూరు గ్రామం వద్ద ఉన్న నల్లవంక బ్రిడ్జి వద్దకు రాగానే సురేశ్‌కు ఎక్కువ మోతాదులో మద్యం తాగిం చారు. స్పృహ కోల్పోయిన తర్వాత నల్లని తాడుతో సురేశ్ గొంతు బిగిం చి హత్య చేసి మృతదేహాన్ని బ్రిడ్జిపై పడేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహం వద్ద తాగిన మద్యం బాటిళ్లు, నీళ్ల ప్యాకెట్లు గ్లాసులు ఉంచారు. దీంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, విద్యాసాగర్ గత మూడు రోజులుగా ఎల్లనూరు పోలీసుల సహకారంతో కేసును ఛేదిం చారు. గురువారం సాయింత్రం బాబు, సుభాన్, కిరణ్, వీర కుమా రి లను అరెస్టు చేసి.. బొలేరో వాహనం, పల్సర్‌బైకు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.. వీరిని ప్రొద్దుటూరు కోర్టులో హాజరు పరచగా కడప జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలపారు.

దుంపలగట్టులో భారీ చోరీ

● రెండిళ్లలో దొంగతనం ● బంగారు , నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఖాజీపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నడు లేని విధంగా దుంపలగట్టు గ్రామంలో గురువారం రాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఇళ్లలోని వారు బయటకు రాకుండా గృహాలకు గడియ బిగించి దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామస్థుల కథనం మేరకు.. గురువారం రాత్రి 11 గంటల వరకు రామాలయం గుడిలో కొందరు గ్రామస్థులు భజనలు చేసి ఇళ్లకు వెళ్లారు. తర్వాత ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ మూడు గృహాలకు బయటకు రాకుండా గడియ బిగించి చోరీలకు పాల్పడ్డారు. తీరా ఉదయం చూస్తే దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ మోహన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిలో 148 గ్రాముల బంగారం, రూ.4.20 లక్షలు నగదు, ఇండ్ల సుధాకర్‌రెడ్డి గృహంలో 20 గ్రాముల బంగారం, రూ.20 వేలు నగదు అపహరణకు గురైందని తెలిపారు. వేలిముద్రలు సేకరించడంతోపాటు డ్వాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి దొంగలను పట్టుకునేందుకు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నామన్నారు. సీసీఎస్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి, క్లూస్‌టీం సీఐ రుక్మిణిదేవి, ఎఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు శిక్ష

బద్వేలు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అర్బన్ పోలీసు స్టేషన్‌పరిధిలో వెంకటరమణారెడ్డి అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన కేసులో నిందితుడు మీసాల వెంకటయ్య, మీసాల శ్రీనివాసులకు శనివారం అడిషినల్ సీనియర్ సివిల్‌జడ్జి 2సంవత్సరాల 6నెలల సాధారణ కారాగార శిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. బాధితుని తరుపున ఏపీపీ కె.రవిచంద్ర వాదనలు వినిపించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులకు శిక్షపడేలా కృషిచేసిన అర్బన్ సీఐ రాజగోపాల్, కోర్టు కానిస్టేబుల్ పి.నాగరాజులను ఉన్నతా ధికారులు అభినందించినట్లు ఆయన తెలిపారు.

బలిజల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మేడ కళ్యాణమండపంలో ఈనెల 22న జరిగే బలిజల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రతి బలిజ కులస్థుడు తప్పకుండా హాజరుకావాలని కోరారు. శుక్రవారం కడపలోని హరిట వర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బలిజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహానేత ఎన్టీరామారావు హయాంలో బలిజలకు మూడు ఎమ్మెల్యే పదవులు ఒక ఎంపీ పదవి ఉండేదని చెప్పారు. ఆ తర్వాత వచ్చిన పార్టీలు బలిజలకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. చంద్రబాబు రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్‌ను బలిజలకు కేటాయిస్తే కుట్రలు చేసి ఓడించారన్నారు. రాయలసీమలో బలిజ కులస్థులు ఎవరు కూడా క్రియాశీలక పదవులలో లేరన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరయ్యే మంత్రి నారాయణ, రామానాయుడు, దుర్గేష్‌లతో చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. బలిజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి అవన్నీ సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బలిజ ప్రతినిధులు నాగరాజు, ప్రసాద్, బాబు, కేవీ రావు, బాలకృష్ణ, రామచంద్రయ్య, మస్తాన్, వెంకటసుబ్బయ్య, సీఆర్‌సీ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజా మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కందిమల్లయపల్లె ఈశ్వరీదేవి మఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి వీరశివకుమారస్వామి తెలిపారు. 22న ఆదివారం ఉదయం ప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం నైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగం, రాత్రి కలశోత్సవం, కలశ స్థాపన నిర్వహించడం జరుగుతుందన్నారు. 23న సోమవారం అశ్వవాహన ఉత్సవం, రాత్రి హంసవాహన ఉత్సవం ఉంటుందని తెలిపారు. 24న మంగళవారం ఈశ్వరీ దేవిమహాదేవి సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్ర సుదినం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు, శాంతి హోమాలు, రాత్రి సింహ వాహనంపై గ్రామోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ, ఊయల సేవ, సాయంత్రం తులాభారం కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 25న పుష్ప రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. 26న పూర్వ మఠాధిపతి వీరబ్రహ్మయ్యాచార్య స్వాముల వారి ఆరాధన నిర్వహిస్తారన్నారు. 27న మహాప్రసాద వినియోగం, దివ్య మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ భక్తులకు అందజేస్తామని తెలిపారు.

నేడు వైవీయూలో ఇండక్షన్ ప్రోగ్రామ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 21వ తేదీ ఉదయం 10గంటలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోస్ట్‌గ్రాడ్యు యేషన్ కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, విశిష్ట అతి థులుగా కుల సచివులు ఆచార్య పి.పద్మ, గౌరవ అతిథులుగా రాజపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్, చిన్మయమిషన్ అధ్యక్షుడు తురి యానందస్వామి, తైక్వాండో శిక్షణా నిపుణులు ఎం.నాగౌర్‌బాబు హాజరవుతున్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులు సాగిస్తూ అనకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈకార్యక్రమం చేపడుతున్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలి



మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

పెండ్లిమర్రి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జితేందర్‌సింగ్ ఈనెల 27వ తేదీ పర్యటన సందర్భంగా ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెల్లటూరులో మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన, పంటల సాగు గురించి, మినుము, చామంతి, వేరుశనగ, మామిడి పంటలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఓబులేసు, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇండోర్ స్టేడియం అక్రమాలపై విచారణ

ప్రొద్దుటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూలు గ్రౌండ్‌లోని ఇండోర్ స్టేడియం మెయింటనెన్స్‌కు సంబంధించి జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు ఆదేశించారు. ఆమేరకు తిరుపతి పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్యామ్ సుందర్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఇండోర్ షటిల్ స్టేడియంకు వచ్చే ఆదాయానికి ఖర్చులకు సంబంధించి గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్లు సంక్రాంతి వెంకటకృష్ణ ప్రమోద్ కుమార్‌లు నిబంధనలు పాటించకుండా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరులో ఈ స్టేడియంలో జరిగిన అవకతవకలపై విజిలెన్సు విచారణ నివేదిక సైతం మున్సిపల్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ నేపథ్యంలో తిరిగి మూడు నెలలలోపు ఈ విచారణ పూర్తి చేసి ఇందుకు బాధ్యులైన అధికారులపై చార్జ్‌ప్రేమ్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏపీజీఈఏ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రఘురామనాయుడు, రాష్ట్ర కోశాధికారి డి.శ్రీహరి పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.ప్రసాద్‌గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ భాగ్యప్రసాద్, ఉపాధ్యక్షులు టి.సుమర్ జి, సి.నజీర్, జి.శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్.గిరిధర్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా ఎస్.జిగాని బాష, మహిళా విభాగం పి.భువనేశ్వరి, కోశాధికారి మహేశ్వరరెడ్డి, డీఈసీ మెంబర్స్‌గా బి.ప్రత్యూష ఎస్.విజయ, రాష్ట్ర ఈసీ మెంబర్‌గా ఎస్.మహబూబ్ రెహమాన్ ఎన్నికయ్యారు. రఘురామనాయుడు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకోసం కృషి చేయాలని నూతన నాయకత్వానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సురేంద్రనాథ్, జిల్లా మాజీ అధ్యక్షులు ఫణీంద్ర, పుల్లయ్య, అబ్దుల్ ఖాదర్, మహేష్, శ్రీహరి, రాజశేఖర్, వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్య

● అనాథలైన కుటుంబసభ్యులు





ఆత్మహత్య చేసుకున్న మల్లేశం (ఫైల్), అనాథలైన కుటుంబ సభ్యులు

దువ్వూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేతికందని పంటలు... వెంటాడిన అప్పుల బాధలు... కుటుంబ కష్టాలు... వెరసి అన్నదాత ఆత్మహత్యకు దారితీశాయి. ఈ సంఘటన దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో జరిగింది. మల్లేశం (35)అనే రైతు తనకున్న అర్ధఎకరంతో పాటు నాలుగు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకున్నాడు. నాలుగేళ్లుగా వివిధ పంటల సాగుకు చేసి సక్రమంగా చేతికి రాకపోవడంతో ప్రతి ఏటా అప్పులపాలయ్యాడు. పంటల సాగుకు రూ.6లక్షలు దాకా అప్పులు చేశాడు. అసలే నిరుపేద కుటుంబం. మూడు సంవత్సరాల నుంచి 8 సంవత్సరాల వయస్సు కలిగిన నలుగురు ఆడపిల్లలు కలిగి ఉన్నారు. భార్య సుమలతతోపాటు తల్లి లక్ష్మీదేవి కూలిపనికి వెళుతున్నా కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో మల్లేశం ఉన్న కొద్ది బంగారం సైతం కుదువకుపెట్టి అప్పులు చేశాడు. ఈ పరస్థితుల్లో చేసిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యజమాని మరణంతో కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి అనాథలా మారింది. ఈ సంఘటన గ్రామస్థులను కలచి వేసింది.

పీఎఫ్ సమస్యలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి

జడ్పీ సీఈఓను కోరిన ఎస్టీయూ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యల పరిష్కారానికి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించి స్పెషల్ డ్రైవ్ ద్వారా దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలను పరిష్కరిం చడానికి చొరవ చూపాలని ఎస్టీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఈఓ చాంబర్‌లో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల పీఎఫ్ సబ్‌స్క్రిప్షన్, మిస్సింగ్ క్రెడిట్లను, ఫైనల్ పేమెంట్లు చెల్లింపుల్లో ఆడిట్‌లో ఎదుర వుతున్న ఇబ్బందులను తెలిపారు. దీంతో పాటు మరికొన్ని సమస్యలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. సీఈఓ స్పందిస్తూ త్వరలో ఒక కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పా టు చేసి సమస్యలను సేకరించి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సురేష్‌బాబు, రమణారెడ్డి, బాల్‌గంగిరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

గ్రామం ఒకటి.. పంచాయతీలు రెండు

- సమస్యలు ఎదుర్కొంటున్నామంటున్న వెంగళకురవపల్లి ప్రజలు
- పనుల కోసం కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందంటున్న వైనం
- ఉన్నతాధికారులకు సమస్యను నివేదిస్తామంటున్న అధికారులు



వెంగళవారికురవపల్లి గ్రామానికి ఏర్పాటు చేసిన బోర్డు



గ్రామానికి మధ్యలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న రెండు గ్రామ పంచాయతీలు

నిమ్మనపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక గ్రామం రెండు పంచాయతీలు కలిసి ఉండడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంగళకురవపల్లి గ్రామంలో దాదాపు 90 కుంటుబాల వారు జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ గ్రామం సగ భాగం నిమ్మనపల్లి పంచాయతీకి, మరో సగభాగం వెంగంవారిపల్లి పంచాయతీకి చెందుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామస్థులు ఏ పనికావాలన్నా సుమారు ఆరు కిలోమీటర్లు గ్రామ పంచాయతీకి రావాల్సి ఉంటుంది. దీనికి తోడు వెంగళకురవపల్లి కొండల సమీపంలో ఉండడం, పంచాయతీలు వేరు కావ డంతో చిన్న పని కావాలంటే తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు. ముఖ్యంగా రెండు రేషన్ షాపులు, భూములు అయితే ఒక గ్రామంలో ఉండి మరో గ్రామంలో నివాసం ఉంటే సమస్యలు వస్తున్నాయి. అంతే కాకుండా గ్రామ సభలు నిర్వహిం చినపుడు ఒక గ్రామంలోని ప్రజలు రెండు పంచాయతీలకు వెళ్లాల్సి రావడం. అదే విధంగా ఎన్నికల సమయంలో ప్రజలు రెండు పంచాయ తీలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వస్తుండడం భారంగా ఉంటోందన్నారు. దీనికి తోడు ఒకే గ్రామానికి రెండు దారులు ఉండడం గమనార్హం. కాగా గ్రామాన్ని ఒకే పంచాయతీ కిం దికి తీసుకొస్తే పనులు చేసుకొనేందుకు సులభత రంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

పనులు కావాలంటే నిమ్మనపల్లి వెళ్లాలి



కార్యాలయాల్లో పనులు జరగాలంటే దాదాపు ఏడు కిలోమీటర్లు ఉన్న నిమ్మనపల్లి వెళ్లాల్సి వస్తోంది. భూ సమస్యలపైనా రేషన్ కొరకు, ఇత ర పనుల కోసం నిత్యం తిరగాల్సిఉంది. సమస్య ను అధికారులు పరిష్కరించాలి.

-నారాయణ, గ్రామస్థుడు, నిమ్మనపలి

సచివాలయాలకు వెళ్లాలంటే సమస్యగా ఉంది



సచివాలయాలకు వెళ్లాలంటే ఇబ్బందులుపడుతున్నాం. రెండు సచివాలయాలు దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో ఏదో ఒక పని మీద సచివాలయాలకు వెళ్లాల్సి రావడంతో కష్టాలు తప్పడంలేదు. మా గ్రామాన్ని ఒకే పంచా యతీగా కిందకు తీసుకొస్తే బాగుంటుంది.

- క్రిష్ణప్ప, గ్రామస్థుడు, వెంగంవారిపల్లి

ప్రజలు సమస్యను తెలియజేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తాం

గత కొన్నేళ్లుగా ఒకే గ్రామం రెండు పంచాయతీల్లో ఉందని ప్రజలు సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఈవోపీఆర్డీ చలపతిరావు పేర్కొన్నారు. వెంగళకురవపల్లి గ్రామ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' ఈవోపీఆర్డీని వివరణ కోరగా పై విధంగా స్పందించారు.

వేర్వేరు కారణాలతో నలుగురు మహిళలు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):వేర్వేరు కారణాలతో నలుగురు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. శుక్రవారం మదనపల్లె మండలం, కొండామరిపల్లె గ్రామానికి చెందిన గుర్రప్ప భార్య రామలక్ష్మమ్మ(58) కుటుంబ కలహాలతో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అలాగే కురబలకోట మండలం, జబ్బావారిపల్లెకు చెందిన నరసింహులు భార్య వి.పాపులమ్మ, బి. కొత్తకోట మండలం, నాయనిబావికి చెందిన మరో మహిళ భవిత(25), నిమ్మనపల్లె మండలం, దిన్నెమీద జంగాలపల్లె చెందిన సుగుణ (30)భర్త మీద కోపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన వారివారి కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కలకడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపాలెం పంచాయతీ బండమీద దళితవాడకు చెందిన రెడ్డెప్పను కులం పేరుతో దూషించిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. పాపిరెడ్డిగారిపల్లె పశువైద్యశాలలో గోపాలమిత్రగా పని చేస్తున్న రెడ్డెప్పను ఎనుగొండపాలెం పంచాయతీ మొర్రంమీదపల్లెకు చెందిన మహేష్‌నాయుడు తన ఆవుకు సొంత పనుల కారణంగా వైద్యం కుదరదని చెప్పాడన్నారు. దీంతో ఆగ్రహించిన మహేష్‌నాయుడు అతని అనుచరులు వీరాంజనేయ నాయుడు, ప్రసాద్‌నాయుడులు రెడ్డెప్పను ద్విచక్ర వాహనంలో వెడుతుండగా అడ్డగించి కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కలకడలో ఇద్దరిపై...

కలకడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):పెట్రోల్ బంకు యజయాని జయప్రకాశ్‌పై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. బాటవారిపల్లె పంచాయతీ కొత్తగాండ్లపల్లెకు చెందిన జయప్రకాశ్ కోన పంచాయితీ తిప్పిగారిపల్లెకు చెందిన రామిశెట్టి సుధాకర్‌తో కలిసి వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వారిమధ్య ఆర్థిక లాభాదేలతో కలహాలు వచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో పెట్రోల్ బంకు వద్ద ఉన్న జయప్రకాశ్ వద్ద సుధాకర్ అతని కుమారుడు మోహన్‌లు వెళ్లి గొడవపడి దాడి చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'మాజీ మంత్రి రోజా నోరు అదుపులోపెట్టుకోవాలి'

మదనపల్లె టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రోజా కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదని నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రద్దు చేసిన పథకాలన్నింటిని సీఎం చంద్రబాబు మళ్లీ పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. జగన్ రద్దు చేసిన ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి నారా లోకేశ్ పునరుద్ధరించారని గుర్తు చేశారు. వాటిని రోజా గమనించాలని, అనవసర ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలే రోజాకు బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలి



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పీలేరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని పీలేరులోని పలు ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం వారు స్థానిక అంబేద్కర్ కూడలిలో కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయనను అవమానించిన అమిత్ షా కేంద్ర మంత్రిగా కొనసాగే నైతిక అర్హత లేదని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, వివిధ సంఘాల నాయకులు ధరణీకుమార్, జెట్టి మల్లిఖార్జున, దుబ్బా శ్రీకాంత్, రాజేశ్వరి, బుక్కే హరినాయక్, బద్దె భానుప్రకాశ్, ముల్లంగి కృష్ణయ్య, ఆనంద్, బాలగంగాధర్, రవిచంద్ర, రెడ్డయ్య, సురేంద్ర, గురునాథ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రిని వెంటనే సస్పెండ్ చేయాలి



అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను వెంటనే సస్పెండ్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేద్కర్ సర్కిల్‌లో బీఎస్పీ జెండాలతో ఆ పార్టీ నాయకులు కేంద్రమంత్రి అమిత్‌సాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ఈ రోజు దేశంలో బడుగుబలహీన వర్గాలు హక్కులు సాధించుకొంటున్నారంటే అది డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో పొందుపర్చడమే అన్నారు. కేంద్ర మంత్రి వెంటనే దేశ ప్రజానికానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, శివ, సంధ్య, అనిల్, మహేష్, రెడ్డెప్ప, వేంపల్లె శివ, నల్లప్ప, పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుడిని కొట్టిన ఎస్‌ఐపై చర్యతీసుకోండి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కరించాలని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారుడినే కొట్టి గాయపర్చిన ఎస్‌ఐ లోకేష్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలం, పంచాలమర్రి గ్రామానికి చెందిన రాజశేఖర్ (42) ఈ నెల 10న తన తల్లి రెడ్డెమ్మ వడ్లు దొంగతనం చేసినట్లు పేర్కొంటూ తన వ్యతిరేకులు అవమానంగా మాట్లాడుతున్నారని తంబళ్లపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తిరిగి ఈ నెల 15న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డిని కలిసి కేసుకట్టాలని అభ్యర్థించగా పి.రాజశేఖర్‌ను తిట్టడమేకాకుండా కొట్టి గాయపర్చినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మాలమహానాడు ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు గుండాల మనోహర్, మల్లెల మోహన్, చంద్ర య్య, కిరణ్, అప్పయ్య, బాధితులు రాజశేఖర్, గంగారాణి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

పీలేరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాంచాలని తారకరామారావు విజ్ఞాన కళాక్షేత్రం సభ్యుడు, పీలేరు టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎన్టీఆర్ నఫీస్ ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని పీలేరు పట్టణంలోని ఏదైనా కూడలిలో ఆవిష్కరించడం వల్ల ప్రజల్లో స్ఫూర్తి నింపినట్లు ఉంటుందని నఫీస్ తెలియజేశారు. త్వరలోనే అనువైన స్థలం ఎంపిక చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని నఫీస్ తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మందికి ఉద్యోగాలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 35 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆల్‌డిజిటెక్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో డిగ్రీ ఫైనలియర్‌కు చెందిన 69 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ప్రతిభ చూపిన 35 మంది టెక్నికల్ అసోసియేట్, కస్టమర్ సపోర్టు ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రమణాచారి, వైస్ ప్రిన్సిపాల్ బి.కృష్ణారెడ్డి అభినందించారు. స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ సంస్థ, సీడాప్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మే ళాలో 23 మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.ఓబులేసు తెలిపారు. వీరికి నెలకు రూ.12వేల నుంచి రూ.19వేల వరకు వేతనం అందిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

వైభవంగా బాల గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పెద్దమండ్యం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం వడ్డిపల్లిలో శుక్రవారం బాల గంగమ్మ తల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు వేద పండితులు వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో నూతనంగా నిర్మించుకున్న ఆలయంలో బుధవారం నుంచి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు భాగంగా శుక్రవారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మ తల్లిని దర్శించుకుని తీర్థ ప్రాదాలు స్వీకరించారు.

నిరుపేదలను ఆదుకోవడమే చంద్రబాబు ధ్యేయం



బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం/గుర్రంకొండ/కలికిరి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి నిరుపేదను ఆదు కోవడమే సీఎం నారా చంద్రబాబునాయుడు ధ్యేయమని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు నెలల క్రితం వాల్మీకిపురం మండలం చింతలవారిపాపల్లెకు చెందిన జహురుద్దీన్ బాషా రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతనికి సీఎం సహాజ నిధి నుంచి వచ్చిన రూ.3,23,780లు చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ అందజేసి పరామర్శించారు. ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, నాయకులు శేషాద్రిరెడ్డి, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు. కాగా గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లె పంచాయితీ ఎగువతొట్లివారిపల్లెకు చెందిన మహిళ పుట్టా కుమారి అనారోగ్యానికి గురై కోలుకుంది. ఈ క్రమంలో బాధిత మహిళ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.70వేలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కావడంతో కలికిరిలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో చెర్లోపల్లె ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌నాయుడు, చలమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.శుక్రవారం నగరిపల్లెలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 12 మందికి విడుదలయిన రూ.40 లక్షల విలువగల చెక్కులను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అందజేశారు.

సాగునీటి సంఘాల సభ్యులకు అభినందనలు

పీలేరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాగునీటి సంఘా ల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులను ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నూతనంగా ఎన్నికైన వారిని ఆయన శుక్రవా రం నగిరిపల్లెలోని తన స్వగృహంలో కలుసుకున్నారు. పీలేరు అయ్యప్పనాయుని చెరువు అధ్యక్షుడిగా ఎన్నికైన హరినాథ్, నూరప్ప చెరువు అధ్యక్షుడిగా ఎన్నికైన అన్నారెడ్డి, చింతల చెరువు అధ్యక్షుడిగా ఎన్నికైన రాయల రమణ, అగ్రహారం చెరువు అధ్యక్షుడిగా ఎన్నికైన బయ్యన్నగారి వెంకటరమణా రెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. నూతన ఎన్నికైన సభ్యులు తమ చెరువుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల వైద్యం కోసం సీఎం అండ

మదనపల్లె టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదల వైద్య చికిత్సల కోసం సీఎం చంద్రబాబు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కుమారుడు జునైద్‌అక్బారి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో కురవంకకు చెందిన బావాజాన్‌కు రూ.5లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును జునైద్ అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు బావాజాన్ తల్లిదండ్రులు ఖాదర్ బాషా, నూర్జహాన్‌లు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లె రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

వాల్మీకిపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియే బోర్డు ఆదేశాల మేరకు శుక్రవారం వెనుకబడిన విద్యార్థులలో మెరుగైన ఫలితాలు దిశగా ఉచిత స్టడీ మెటీరియల్ ను ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి.పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎంచుకున్న లక్ష్యం దిశగా కృషి చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ సమయంలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనే బాస్ లక్ష్యం



బాస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మదనపల్లె, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సమసమాజ నిర్మాణం కోసం భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలనే లక్ష్యంగా భారతీయ అంబేద్కర్ సేన(బాస్) అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్ అన్నారు. శుక్రవారం మదనపల్లెలో కాలనీ గేట్ వద్ద బాస్ జెండాను ఎగురవేసి 13వ వార్షికోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాస్ 13 ఏళ్ల ప్రస్థానంలో గల్లీ టూ ఢిల్లీ వరకు అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ జవహర్ బాబు, విశ్రాంత ఏఎస్పీ పెద్దయ్య, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మండెం ప్రభాకర్, ఉద్యోగ నేతలు మారప్ప, గిరిబాబు, నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మురుగు కాలువలో అబేట్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్న వైద్యాధికారులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తంబళ్లపల్లె నియోజకవర్గ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో కలసి కందుకూరు ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని మడుమూరులో పర్యటించి గ్రామంలో ఉన్న మురుగు నీటి కాలువలను పరిశీలించారు. గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి అబెట్ మందును పిచికారి చేయించారు. ఆయా గ్రామాల్లో ఉన్న ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వేలను చేసుకొని రక్త నమూనాలను సేకరించి ప్రతి రోజు ల్యాబ్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ దనమ్మ, ఎంపీ హెచ్‌ఈవో ఈశ్వ రయ్య, ఏఎన్ఎంలు రామలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పి దివ్య, ఆశాలు పాల్గొన్నారు.

రేపు బెంగళూరులో మిట్స్ అలుమ్ని మీట్

కురబలకోట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో బెంగళూరులో మిట్స్‌అలుమ్ని మీట్‌ను ఈ నెల 22న నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెంగళూరులోని బెల్లందూర్ ఐకాన్ ప్రీమియర్ హోటల్ ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కళాశాల పూర్వవిద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లేఅవుట్లలో కలసిపోతున్న భూములను కాపాడండి



వలసపల్లె రెవెన్యూ సదస్సులో అధికారులకు అర్జీలు ఇస్తున్న ప్రజలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలో వేసిన లేఅవుట్లలో కలసిపోతున్న తమ భూములను కాపాడాలని పలువురు గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం వలసపల్లెలో డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ జాతీయరహదారి పక్కనే పలువురు లేఅవుట్లు వేసి తమ భూములు ఆక్రమించుకుంటుండగా మరి కొందరు అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీని వలన గ్రామ పంచాయతీ, ప్రభుత్వం ఆదాయం కోల్పోతున్నాయని వాటిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, డీటీ అస్లాంబాషా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

డీకేటీ భూములను ఇతరులకు విక్రయించరాదు



రెవెన్యూ సదస్సులలో అర్జీదారులతో మాట్లాడుతున్న డీపీవో బాలకృష్ణారెడ్డి

నిమ్మనపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పేదల కొరకు ఇచ్చిన డీకేటీ భూములను కొనడం అమ్మడం చట్టరీత్యా నేరమని ప్రత్యేక అధికారి డీపీవో బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తవళం గ్రామపంచాయతి ఆవరణలో రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటివారైనాగాని చట్టరీత్యా చర్యలు తీసుకొంటామన్నారు. డీకేటీ భూమి అవసరము లేకపోలే ప్రభుత్వమే స్వాధీనం చేసుకొంటుదని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సులలో 360 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆవోపీఆర్డీ చలపతిరావు, నాయకులు రామకృష్ణ, చెంగ్రాయుడు, మల్లికార్జున. రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

కలకడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూములు అక్రమణలకు గురికాకుండా పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటునట్లు ఆర్డీవో ఏ.శ్రీనివాసులు తెలిపారు. కలకడ మండలం బాటవారిపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మండలం లోని గ్రామాల్లో అన్రాక్రాంతమైన చెరువులు, కుంటలు, రస్తాలు, ఇతర ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని సిబ్బంది ఆదేశించారు. ముఖ్యంగా రీ సర్వేలో దొర్లిన తప్పిదాలపై ప్రత్యేక దృష్టి సాధిస్తునట్లు తెలిపారు. కొన్ని చోట్ల చిన్న చిన్న భూ సమస్యలున్న అవి రైతుల పరస్పర అంగీకారంతో పరిష్కృతం అవుతాయ న్నారు. రెవెన్యూ పరంగా భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా ఉండడానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయచోటి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 164 గ్రామాల్లో వచ్చే నెల 8వ తేదీ వరకు జరిగే సదస్సులను ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రవిచం ద్రబాబు, తహశీల్దార్ ఫణికుమార్, డీటీ భార్గవి సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో: భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. పీలేరు మండలం బాలంవారిపల్లెలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. బాలంవారిపల్లెలో జరిగిన సదస్సులో వివిధ భూసమస్యలపై అధికారులకు 50 అర్జీలు అందాయి. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి రమ, నోడల్ అధికారి భరత్ కుమార్‌రెడ్డి, తహసీల్దారు భీమేశ్వర రావు, సర్వేయర్ కిరణ్మయి పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం గ్రామ పంచాయతీ చెరువుకిందపల్లి లో శుక్రవారం రైతు సదస్సులో అన్నిశాఖల సమస్యలపై 72 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, ఆర్ఐ రమేష్, కూటమి నేతలు లంపవంక చెరువు చైర్మన్ చలపలతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గూడుపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అసమర్థ పాలన వల్ల గ్రామాల్లో భూ సమస్యలు భారీగా ఉన్నాయన్నారు. భూ సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, తహసీల్దార్ ప్రదీప్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు జనార్ధన్‌రెడ్డి, సుబ్బినాయుడు, నారాయణ, మల్లికార్జుననాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించండి



తహశీల్దార్ కు వనతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

బి.కొత్తకోట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏడు గ్రామాలకు ఇలవేల్పు అయిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని మండలంలోని మొటుకుపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు అధికారులకు విన్నవించారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని పులుసుమానిపెంట సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులో పంచాయతీ పరిధిలోని అరిమానిపెంట, పులుసుమా నిపెంట, బద్దిపల్లి, చిన్నపల్లి, ముడివారిపల్లె, గట్లమీదపల్లె గ్రామస్థులు పురాతన చరిత్ర కలిగిన కనుమలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకున్నందున అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి మొటుకుశివ, మాజీ ఎంపీటీసీ ఉమాదేవి, శ్రీధర్‌రెడ్డి, మల్లికార్జున, రమణప్ప, రఘునాయుడు, విశ్వనాథ్, గంగులప్ప పాల్గొన్నారు.

సీఎన్ఆర్ కళాశాలకు అటల్ అచీవ్‌మెంట్ అవార్డు



కేంద్ర మంత్రుల నుంచి అవార్డు అందుకుంటున్న విజయ భాస్కర రెడ్డి

పీలేరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఉత్తమ సేవ లు అందించినందుకుగాను పీలే రులోని సీఎన్ఆర్ డిగ్రీ కళాశా లకు ప్రతిష్టాత్మక 'అటల్ అచీవ్ మెంట్ అవార్డు-2024' లభించింది. న్యూఢిల్లీలోని టాప్‌నోట్ ఫౌండే షన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన అటల్ అచీవ్‌మెంట్ అవార్డ్స్- 2024లో భాగంగా రాష్ట్రంలో ఆర్ట్స్ విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు 'నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్' అవార్డు దక్కినట్లు కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర రెడ్డి తెలిపారు. న్యూఢిల్లీలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, మరో మంత్రులు టోఖన్ సాహు, రక్షా ఖాడ్సే, రాజస్థాన్ మాజీ గవర్నర్ ఖల్‌రాజ్ మిశ్రా చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న వారిని పలువురు అభినందించారు.

'మానవత' సంస్థకు ఆర్థిక సాయం

పీలేరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన విశ్రాంత హెచ్ఎం రాజగోపాల్ రెడ్డి 'మావనత' సంస్థకు రూ.5,116ల ఆర్థిక సాయం అందించారు. తన తల్లిదండ్రులైన సిద్దారెడ్డి, రామసుబ్బమ్మ వర్ధంతి సందర్భంగా విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు. మానవత సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న సంకల్పంతో విరాళం అందజేసినట్లు తెలిపారు. సంస్థ నిర్వాహకులు వంగిమళ్ల రామచంద్ర, శెట్టిసుబ్రహ్మణ్యం, వైవీ రమణ, రాచపల్లె కృష్ణమూర్తిలకు చెక్కు అందజేశారు.